


మ్యుటేషన్‌తో ఆస్తుల మార్పు

- కూటమి ప్రభుత్వ నిర్ణయం
- ఆగస్టు 1వ తేదీ నుంచి అమలు
- నగరపాలక, సచివాలయ సిబ్బందికి శిక్షణ
- అవినీతి, అక్రమాలకు ఆస్కారం ఉండదు



ఆస్తులు కొనుగోలు చేసి తరువాత వారి పేర్లపై హక్కులను మార్పు విధానమే మ్యుటేషన్. ప్రజలు తమకు సంబంధించిన ఆస్తులను మార్పు చేసుకునేందుకు వివిధ రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని అధిగమించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. భూములను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వెంటనే ఆన్‌లైన్ విధానంలో ఆటో మ్యుటేషన్(ఆన్‌లైన్‌లోనే యజమాని పేరు మారడం) జరుగుతుంది. డిజిటల్ డేటా ఆధారంగా పారదర్శకతతో కూడిన సేవలు అందుబాటులోకి వస్తాయి. అవినీతి, అక్రమాలకు ఎలాంటి అవకాశాలు ఉండవు. రిజిస్ట్రేషన్ తరువాత ఆస్తి వివరాలు, పన్నుల నమోదు, ఆస్తిపన్ను రికార్డుల్లో చేరుతాయి.

కర్నూలు న్యూసిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమకు సంబంధించిన ఆస్తులను మార్పు చేసుకునేందుకు వివిధ రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ అవస్థలను తీర్చేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రెవెన్యూ శాఖ పరిధిలోని భూములను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వెంటనే ఆన్‌లైన్ విధానంలో ఆటో మ్యుటేషన్(ఆన్‌లైన్‌లోనే యజమాని పేరు మారడం) జరుగుతుంది. ఈవిధానం అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఇటీవల క్యాబినెట్‌లో దీనిని అమలు చేసేందుకు ఆమోదించారు. ఈ సేవలను నగర పాలక సంస్థ పరిధిలో ఆగస్టు 1 నుంచి అందుబాటులోకి వస్తున్నాయి. కొత్త విధానంపై ఇప్పటికే నగర పాలక, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.



గతంలో అధికారులు ఎంతో కొంత..

ఆస్తులు కొనుగోలు చేసి తరువాత వారి పేర్లపై హక్కులను మార్చుకునే విధానమే మ్యుటేషన్. పట్టణాల్లో ఆస్తులు కొనుగోలు చేసిన తరువాత ఇంటి, కుళాయి పన్ను రసీదుల్లో పేరు మార్పు కోసం మార్కెట్‌లో ఆ ఆస్తి విలువలో ఒక శాతం మ్యుటేషన్ ఫీజుగా చలానా చెల్లించి సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటారు. ఆ దరఖాస్తు ఆర్ఐ, మేనేజర్, కమిషనర్‌కు చేరుతుంది. దరఖాస్తు ముందుకు వెళ్లాలంటే అధికారులకు ఎంతో కొంత ముడుపులు ఇవ్వాల్సిన పరిస్థితి. అన్ని కరెక్టుగా ఉంటే చివరకు కమిషనర్ లాగిన్‌లో పేరు మార్పు జరుగుతుంది. నిబంధనల ప్రకారం 14రోజుల్లో ఈ మొత్తం ప్రక్రియం పూర్తి కావాలి. హక్కుల బదలాయింపు కోసం యజమానులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

నూతన విధానంతో...

రిజిస్ట్రేషన్ సమయంలో గతంలో ఆ ఇంటికి చెల్లిస్తున్న పన్ను రసీదు సమర్పించాలి. స్థలమైతే వీఎల్‌టీ(వెకెంట్ ల్యాండ్ టాక్స్) రసీదు అందజేయాలి. తరువాత ఆటోమెటిక్‌గా నగరపాలక రికార్డుల్లో పేరు మారుతుంది. అవి లేనిపక్షంలో పన్ను వేయాల్సిన అవస రాన్ని వివరిస్తూ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి నగర పాలక లాగిన్‌కు సమాచారం వస్తుంది. ఆమేరకు పేరు మార్చి పన్ను విధిస్తారు. ఒకే ఆస్తిని ఇద్దరు ముగ్గురు కలిసి కొనుగోలు చేసిన ఇదే విధానం వర్తిస్తుంది. డిజిటల్ డేటా ఆధారంగా పారదర్శకతతో కూడిన సేవలు అందుబాటులోకి వస్తాయి. అవినీతి, అక్రమాలకు ఎలాంటి అవకాశాలు ఉండవు. రిజిస్ట్రేషన్ తరువాత ఆస్తి వివరాలు, పన్నుల నమోదు, ఆస్తిపన్ను రికార్డుల్లో చేరుతాయి.

టైటిల్ మార్చి పన్ను విధింపు

నగరంలో ఏదైనా స్థలం, ఇళ్లు కొనుగోలు చేసుకుంటే ఆ ఆస్తిని తమ పేరిట మార్చుకునేందు కు నగర పాలక కార్యాలయంలో ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. సచివాలయం ద్వారా రిజిస్టర్ పత్రాలు ఆన్‌లైన్‌లో పంపితే అధికారులు పరిశీలించి టైటిల్ మార్చి పన్ను విధిస్తారు.

ఆటో మ్యుటేషన్‌తోనే పేరు మార్పు



సుపరిపాలనలో భాగంగా రిజిస్ట్రేషన్ లావాదేవీలు వేగవంతం అవుతాయి. ఇళ్లు, ప్లాట్లు ఏవైనా రిజిస్ట్రేషన్ జరిగినప్పుడే ఆటో మ్యుటేషన్‌తోనే పేరు మార్పు చేస్తారు. దీనికి సంబంధించి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రజలు రిజిస్ట్రేషన్ సమయంలోనే పేరు మార్పు కోసం అధికారులను సంప్రదించాలి.

- పి.విశ్వనాథ్, నగర పాలక కమిషనర్, కర్నూలు

రైతులకు శుభవార్త



- ఆగస్టు 2న మొదటి విడత 'అన్నదాత సుఖీభవ'
- రూ.7వేలు రైతుల ఖాతాల్లో జమ
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆరున్నర లక్షల మంది రైతులు
- 4.31లక్షల మందికి మాత్రమే లబ్ధి
- ఇంకా కొనసాగుతూనే ఉన్న కౌలురైతుల గుర్తింపు



అన్నదాతకు పెట్టుబడి కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. పంట సాగు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన పెట్టుబడి మొత్తాన్ని ఎప్పుడెప్పుడు జమచేస్తారోనని మే మాసం నుంచి ఎదురుచూస్తున్నరైతులకు కూటమి ప్రభుత్వం శుభవార్తను అందించింది. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5వేలు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం ద్వారా రూ.2వేలు కలిపి మొత్తం రూ.7వేలను ఆగస్టు 2వ తేదీన రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేసిందని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కౌలు రైతులతో కలిపి 6.50 లక్షల మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాతలందరినీ పీఎం కిసాన్‌తో పాటు కౌలురైతుల గుర్తింపునకు ఏ మాత్రం చర్యలు తీసుకోకపోవడంతో ప్రస్తుతం రెండు లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయానికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని అర్హత పొందని రైతులు మొర పెట్టుకుంటున్నారు.

కర్నూలు అగ్రికల్చర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం శుభవార్త అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అన్నదాత సుఖీభవ పథకానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగున్నర లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవతో పాటు పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం మొదటి విడత రూ.7వేలు అందించేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఈమొత్తానికి అర్హులైన రైతుల జాబితాలు ఇప్పటికే రెండు జిల్లాలో వ్యవసాయ యంత్రాంగం పూర్తిచేసింది. 'అన్నదాత సుఖీభవ' కింద కూటమి ప్రభుత్వం కేంద్రం ఇచ్చే డబ్బులను కలిపి ఏడాదికి రూ.20వేలను మూడు విడతల్లో అందిస్తారని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ.6వేలు కాగా రాష్ట్రం వాటా రూ.14వేలు ఉంది. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.6వేలను మూడు విడతలుగా ఒక్కో విడతలో రూ.2వేల చొప్పున రైతుల ఖాతాకు

మిగతా 6లో

ప్రతి రైతుకు అందించేలా చర్యలు

- ఆగస్టు 2న 'అన్నదాత సుఖీభవ' జమ
- కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు అగ్రికల్చర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతి రైతుకు 'అన్నదాత సుఖీభవ' అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా రెవెన్యూ వ్యవసాయ శాఖల యంత్రాంగాన్ని ఆదేశించారు. బుధవారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల నిధుల జమ చేసే అంశంపై రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగస్టు 2వ తేదీన అన్నదాత సుఖీభవ పథకం కింద మొదటి విడత నిధులు జమ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. జిల్లా మొత్తం మీద 2,75,749 మంది రైతులకు గానూ పెండింగ్‌లో ఉన్న ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కౌతాళం 258 మంది రైతులు, హాలహర్విలో 195, చిప్పగిరిలో 182, పత్తికొండలో 180, ఆలూరులో 172 మంది రైతులను పెండింగ్‌లో ఉంచారని, ఎందుకు పెండింగ్‌లో ఉందని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులతో ఆరాతీశారు. కొంతమంది రైతులు పొలం ఉన్న చోట కాకుండా వివిధ కారణాలతో ఇతర ప్రదేశాల్లో నివాసం ఉంటున్నారని, మరి కొంత మంది చనిపోయారని కలెక్టర్‌కు వివరించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో జేసీ డా.బి.నవ్య, వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, ఎల్‌డీఎం రామచంద్రరావు, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

'సిల్వర్ జూబ్లీ' అంటే ఒక బ్రాండ్

- క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ కట్టా
- సిల్వర్ సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

కర్నూలు అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): కర్నూలులోని సిల్వర్ జూబ్లీ కళాశాల అంటే ఒక బ్రాండ్ అని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సిల్వర్ సెట్ కౌన్సెలింగ్‌ను ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులుతో కలిసి నిర్వహించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఇక్కడ చదివిన ప్రతిఒక్కరికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఇక్క డ సీటు పొందిన విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని విశ్వవిద్యాలయానికి, ఆధ్యాపకులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. సెట్ కన్వీనరు వాయిజ్ మాట్లాడుతూ మొదటి రోజు కౌన్సెలింగ్‌కు 120 మంది హాజరయ్యారని తెలిపారు. ఒక్క సీటుకు ముగ్గురు చొప్పున కౌన్సెలింగ్‌కు పిలిచామన్నారు. కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి. ప్రసాదరెడ్డి, ఆధ్యాపకులు ఎల్లా కృష్ణ, ఫామీదాబేగం, ఓబులేసు, రాజశేఖర్, నాగన్న, నరేంద్ర బాబు పాల్గొన్నారు.

ఆదోని మార్కెట్‌కు భారీగా వేరుశనగ

- విక్రయానికి 6,177 బస్తాలు
- గరిష్ఠ ధర రూ.6,616



ఆదోని మార్కెట్‌లో వేరుశనగ

ఆదోని అగ్రికల్చర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు బుధవారం వేరుశనగ(పల్లీ) దిగుబడులు పోటెత్తాయి. రైతులు భారీగా వేరుశనగను విక్రయానికి తీసుకువచ్చారు. దీంతో ప్లాట్‌ఫారాలపై ఎటుచూసినా పల్లీలే కనిపించాయి. వేసవికాలం బోరుబావుల కింద, కాలువల కింద సాగిన పంట చేతి కందడంతో విక్రయా నికి తెచ్చారు. ధరలు కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 6,177 బస్తాల వేరుశనగ విక్రయానికి రాగా క్వింటా వాటి కనిష్ఠ ధర రూ.3,216, గరిష్ఠ ధర రూ.6,616, మధ్యస్థ ధర రూ.5,879 పలికింది.

తుంగభద్రకు తగ్గిన వరద ఉధృతి



మంత్రాలయం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదికి వరద ఉధృతి తగ్గింది. హొస్పెటలోని టీబీ డ్యాం ఎనిమిది గేట్లను ఎత్తి 41,400 క్యూసెక్కుల నీటిని దిగువనున్న తుంగభద్ర నదికి విడుదల చేశారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం వద్ద బుధవారం సాయంత్రం 310.83మీటర్ల నీటిమట్టంతో 90,250 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. టీబీ డ్యాం నుంచి నాలుగు గేట్లను ఐదు అడుగులు, ఒక గేటును4.5 అడుగులు. మరో గేటును నాలుగు అడుగులు, రెండు గేట్లను 3.5 అడుగులు ఎత్తి 41,400 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేశారు. డ్యాంలోకి ఇన్‌ఫ్లో 60,818 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించవద్దని, షవర్లవద్ద స్నానాలు చేయాలని శ్రీమఠంఅధికారులు సూచించారు. డ్యాం నుంచి వరద భారీగా తగ్గించడంతో రెవెన్యూ, శ్రీమఠంఅధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. నదిఒడ్డున ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీసులు, శ్రీమఠం సెక్యూరిటీ, గజ ఈతగాళ్లతో బందోబస్తును నిర్వహిస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాలను పాటించాలి : ఈవో

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్ర పరిధిలో హోటళ్ల నిర్వాహకులు పరిశుభ్రతతో పాటు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఆలయ ఈవో శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం మల్లికార్జున కల్యాణ మండపంలో ఈవో క్షేత్ర పరిధిలోని హోటళ్ల యజమానులతో సమావేశమయ్యారు. హోటళ్ల నిర్వాహకులకు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంటకాలలో తాజా కూరగాయలను మాత్రమే వాడాలని సూచించారు. భక్తులకు నిల్వ ఆహారపదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హోటళ్లలో పనిచేసే సిబ్బంది భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, 18 యేళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. ఏఈవో మల్లికార్జునరెడ్డి, ప్రజాసంబంధాల అధికారి శ్రీనివాసరావు, పర్యవేక్షకులు రాధాకృష్ణ పాల్గొన్నారు.

'తొలి అడుగు' విజయవంతం

- ఆగస్టులో జిల్లాకు రానున్న చంద్రబాబు, లోకేశ్
- గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్ పనులకు గ్రీన్ సిగ్నల్
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు, నాయకుల మధ్య చిన్నపాటి విభేదాలు ఉన్నప్పటికీ 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని సమష్టిగా విజయవంతం చేశామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో ఆయన విలేకరులతో మాట్లాడారు. తొలిఅడుగు కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సంక్షేమాన్ని తెలియజేయడంతో పాటు వైసీపీ కుట్రలను కూడా వివరించామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఆగస్టు నెలలో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ వస్తున్నారన్నారు. వారు ఏదో ఒక నియోజకవర్గంలో పర్యటిస్తారని తెలిపారు. కర్నూలు జిల్లా పరిశ్రమల హబ్‌గా మారబోతోందన్నారు. ఉమ్మడి జిల్లాలో 30 వేల టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. పోలవరం, అమరావతితో పాటు జిల్లాలో గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్ పనులకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, భూసేకరణకు అవసరమైన నిధులు కూడా ఇస్తామని చెప్పారన్నారు.

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అంతా అవినీతిలోనే నడిచిందని, వారు చేసిన స్కామ్‌లు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. వైసీపీ నాయకులు జగన్‌కు మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక పరామర్శల పేరుతో అరాచకాలు సృష్టించేదుకు జగన్ కుట్రలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీష్ కుమార్, విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు పోతురాజు రవికుమార్, ధరూర్ జేమ్స్, ముంతాజ్, జిల్లా కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు, బేతం కృష్ణుడు, హనుమంతరావు చౌదరీ, పుల్లయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

భోజనం ఎలా ఉంది..?

- అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



భోజనం నాణ్యతపై ఆరా తీస్తున్న కలెక్టర్

కర్నూలు న్యూసిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్లలో భోజనం నాణ్యత, రుచిపై కలెక్టర్ రంజిత్ బాషా నేరుగా వెళ్లి ఆరాతీశారు. తన షెడ్యూల్‌లో లేనప్పటికీ ఆకస్మికంగా అన్నక్యాంటీన్లను బుధవారం కలెక్టర్ తనిఖీ చేశారు. నగరంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌కు వెళ్లిన కలెక్టర్... అక్కడ పరిసరాలను, వడ్డించే విధానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. 'అన్నం ఎలా ఉంది? రుచిగా ఉందా లేదా? ఇంకా ఏమైనా మార్పులు కోరుకుంటున్నారా..' అంటూ అక్కడ భోజనం చేస్తున్న ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన ప్రజలు 'అన్నం నాణ్యతగా ఉందని, రుచిగానే ఉంది. రోజూ ఇక్కడే భోజనం చేస్తున్నాం సార్...' అంటూ కలెక్టర్‌కు తెలియజేశారు. అన్న క్యాంటీన్ సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయంలో ఎంతమంది భోజనం చేస్తున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ బయట కూర్చుని భోజనం చేస్తున్న వారికి టేబుల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం క్యాంటీన్ పరిసరాలలో పూలు అమ్ముకునే వారితో మాట్లాడారు...పెన్షన్ వస్తుందా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. కలెక్టర్ వెంట నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఉన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో నంద్యాల కలెక్టర్

● ఘనస్వాగతం పలికిన శ్రీమఠం అధికారులు

● జ్ఞాపిక, శేషవస్త్రం, ప్రసాదం అందజేత



శ్రీమఠంలో ప్రదక్షిణలు చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

మంత్రాలయం, జూలై 30(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి కుటుంబ సమేతంగా బుధవారం సాయంత్రం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వీరికి మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేషపూజలు చేశారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట ఏఏవో మాధవశెట్టి, తహసీల్దార్ రమాదేవి, ఆర్ఐ జనార్దన్ రావు, అనంతపురాణిక్, అనంతస్వామి, ప్రకాశ్ఆచార్, పవన్ ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, స్వామిరాయ్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

అహోబిలం ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

● రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ అంజనీ కుమార్

● లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ఆలయంలో ప్రదిక్షణలు చేస్తున్న జైళ్ల శాఖ డీజీపీ అంజనీ కుమార్

ఆళ్ళగడ్డ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసిం హస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ అంజనీకుమార్ అన్నారు. బుధవారం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబీ వేణుగోపాల్‌స్వామి ఆధ్వర్యంలో పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ విశిష్టతను ప్రధాన అర్చకులు వేణుగోపాల్‌స్వామి డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా అంజనీకుమార్ మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐ వరప్రసాద్, ఏపీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శెట్టి విజయకుమార్, టీడీపీ అధ్యక్షుడు గూడురు సంజీవరాయుడు, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయండి

● కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒకే అర్జీ మూడుసార్లు పునరావృతమైతే సంబంధిత తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా డీఆర్వోను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయం నుంచి పీ-4 పాలసీ, తల్లికి వందనం, హౌసింగ్, ఉపాధి హామీ, తాగునీరు పీజీఆర్ఎస్, యూరియా లభ్యత తదితర అంశాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా పంపిణీలో సమస్యలు లేకుండా చూడాలని సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. 507 ఫిర్యాదులు తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ల వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, డీఎస్‌వో శ్యామల తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి ఆది కర్మ యోగి అభియాన్ పథకం

కర్నూలు కలెక్టరేట్, జూలై 30(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి ఆది కర్మ యోగి అభియాన్ పథకాన్ని అమలు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో ఆది కర్మ యోగి అభియాన్ పథకం అమలుపై వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవోలతో సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గిరిజనులు, సంచార జాతుల వారి అభ్యున్నతికోసం ఆది కర్మయోగి అభియాన్ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. జిల్లాలో 35వేల మంది గిరిజనులు ఉన్నారని, వీరికి అన్ని పథకాలు, సేవలు సంతృప్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవా లన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, డిటీడబ్ల్యూవో కొండయ్య పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు గడువు పెంపు

● నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ పద్మావతి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు గడువును పొడగించినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఉమ్మడి కర్నూలు జిల్లావాసులై ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు తేదీని 13ఆగస్టు 2025వ తేదీ వరకు పొడగించామ న్నారు. అభ్యర్థులు అప్లికేషన్‌ను పూర్తిచేసే సమయంలో పోర్టల్‌లో కుల ధృవీకరణ పత్రాన్ని అప్‌లోడ్ చేయడం తప్పనిసరి కాదన్నారు. అభ్యర్థులు 3, 4వ తరగతులను ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 5వ తరగతి విద్యార్థులు ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుతూ ఉండాలన్నారు. డిసెంబర్ 13వ తేదీన ఎంపిక రాతపరీక్ష ఉంటుందన్నారు.

హత్య కేసులో ఇద్దరికి జైలు శిక్ష

● ఒకరికి యావజ్జీవం, మరొకరికి ఏడేళ్లు

మహానంది, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం సమీపంలోని మానసిక వికలాంగుల పాఠశాల సమీపంలో 2015 సంవత్సరంలో న్యాయవాది కె. బసవరాజును హత్య చేసి మృతదేహాన్ని దహనం చేసిన ఘోర ఘటనపై నంద్యాల మూడో అదనపు జిల్లా కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. విచారణలో నేరం రుజువు అవ్వడంతో రెండో నిందితుడు బలిజ సాయన్న గారి నాగరాజుకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా, మూడో నిందితుడు నాగేంద్రకు 7 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు. మెదటి నిందితురాలు సుజాత ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో తీర్పు వాయిదా వేశారు. నాలుగో నిందితుడు ఇల్లూరి వెంకటరెడ్డి విచారణకు ముందే మృతిచెందాడు. వివాహేతర సంబంధం, అశ్లీల వీడియోల ఆధారంగా జరిగే బెదిరింపుల నేపథ్యంలో కుట్ర పూర్వకంగా హత్య జరిగినట్లు కోర్టు నిర్ధారించింది. ఈకేసు దర్యాప్తులో కీలకపాత్ర పోషించిన మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, అదనపు ప్రభుత్వ అభియోక్తలు తిరుపతి, వైవీ గోపాలకృష్ణరెడ్డి, రాజేశ్వరరెడి, కోర్టు హెడ్ కానిస్టేబుల్ విద్యాసాగర్‌ను జిల్లా పోలీస్ అధికారి అధిరాజ్‌సింగ్ రాణా, ఏఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్, సీఐ శ్రీనివాసులరెడ్డి అభినందించారు.

రైతులకు శుభవార్త



(5పేజీ తరువాయి)

జమ చేస్తుంది. అన్నదాత సుఖీభవ నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. తొలి విడతలో రూ.7వేలు, రెండో విడతలో రూ.7వేలు, మూడో విడతలో రూ.6వేలు మొత్తం రూ.20వేలు ఒక ఏడాదికి రైతుల బ్యాంకు ఖాతాలకు జమ కానున్నాయి.

కౌలు రైతులతో కలిపి..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కౌలురైతులతో కలిపి 6.50లక్షల మంది రైతులున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాతలందరినీ పీఎం కిసాన్‌తో పాటు కౌలురైతుల గుర్తింపునకు ఏ మాత్రం చర్యలు తీసుకోకపోవడంతో ప్రస్తుతం 2లక్షల మంది రైతులు పెట్టుబడి సాయానికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని అర్హత పొందని రైతులు మొర పెట్టుకుంటున్నారు. కర్నూలు జిల్లాలో 2,50,634 మంది రైతులు మాత్రమే ఇప్పటి దాకా ఇకేవైసీ, ఈక్రాఫ్ బుకింగ్ పూర్తిచేసుకుని మొదటి విడత ఆర్థికసాయానికి అర్హత సాధించారు. వివిధ కారణాలతో 7,601 మంది లబ్ధి పొందలేని పరిస్థితి నెలకొంది. నంద్యాల జిల్లాలో 1,80,787 మంది మాత్రమే ప్రభుత్వ సాయానికి అర్హత సాధించారు. ఇంకా 4,510 మందికి ఆర్థిక సాయం అందించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రెండు జిల్లాలో 12,111 మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పెట్టుబడి సాయానికి దూరమవుతున్నారు. వీరందరినీ అర్హత జాబితాలో చేర్చేందుకు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. ఆగస్టు 2వ తేదీకి ఈకసరత్తు పూర్తయితేనే వీరందరికీ అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందుతుంది.

కౌలురైతుల గుర్తింపు ప్రక్రియ..

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంది. గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించే ప్రక్రియ నత్తను తలపిస్తోంది. కర్నూలు జిల్లాలో 25వేల మంది కౌలు రైతులను గుర్తించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికీ 2,695 మంది రైతులకే గుర్తింపు కార్డులు ఇచ్చారు. నంద్యాల జిల్లాలో 30వేల మంది కౌలు రైతులకు గానూ కేవలం 4,030 మంది కౌలు రైతులకు మాత్రమే గుర్తింపు కార్డులు ఇచ్చారు. రెండు జిల్లాలో 55వేల మందికి పైగా కౌలు రైతులు ఉన్నా కూడా కేవలం 7వేల మందికి మాత్రమే గుర్తింపు కార్డులు ఇచ్చారు.

అర్హత ఉన్నరైతులందరికీ..

అర్హత ఉన్న రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ' మొదటి విడత రూ.7వేలను ఆగస్టు 2న రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకున్నాం. కర్నూలు జిల్లాలో ఈకేవైసీ తదితర కారణాల వల్ల అర్హత కోల్పోయిన రైతులందరికీ ఆటంకాలను తొలగించి వారిని కూడా లబ్ధిదారులుగా చేర్పించే కార్యక్రమం చేపట్టాం.

● వరలక్ష్మి, జేడీ, కర్నూలు



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



హాజరైన వివిధ బ్యాంకు మేనేజర్లు

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలి

● ప్రతి బ్యాంకు వద్ద సెక్యూరిటీ గార్డులు ఉండాలి

● సైబర్ నేరాలపై ఖాతాదారులను అప్రమత్తం చేయాలి

● ఎస్పీ విక్రాంత్ పాటిల్ ● బ్యాంకర్లతో సమావేశం

కర్నూలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి బ్యాంకు వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో బ్యాంకు భద్రతా ప్రమాణాలపై జిల్లాలోని వివిధ బ్యాంకుల మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, హర్యానా రాష్ట్రాల్లో హైవే పక్కన ఉన్న బ్యాంకులో జరిగిన దొంగతనాల గురించి గుర్తుచేశారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో జరగకుండా బ్యాంకు అధికారులు భద్రతలను పకడ్బందీగా ఏర్పాటుచేసుకో వాలన్నారు. బ్యాంకు బయట, లోపల అన్ని ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయా లన్నారు. బ్యాంకుల్లో సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలన్నారు. లారీ డ్రైవర్స్ లారీల్లో కార్లను డెలివరీ చేసేందుకు వచ్చి రెక్కీ నిర్వహించి దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. ఖాతాదారుల ఖాతాల్లో పెద్దమొత్తాల్లో లావాదేవీలు జరిగినప్పడు బ్యాంకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ సైబర్ మోసగాళ్ల గురించి ఖాతాదారులను అప్రమత్తం చేయాలన్నారు. ఓటీపీ ఫ్రాడ్స్, ఏపీకే ఫైల్స్, డిజిటల్ ఫ్రాడ్స్, గురించి బ్యాంకుల్లో హెచ్చరిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జే.బాబు ప్రసాద్, బ్యాంకు మేనేజర్లు అబ్దుల్ రావూఫ్, వీరయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ తేజమూర్తి, పట్టణ సీఐలు రామయ్యనాయుడు, నాగరాజరావు, శ్రీధర్, విక్రమసింహ, చంద్రబాబు నాయుడు, మన్సూరుద్దీన్, నాగశేఖర్, సైబర్ ల్యాబ్ సీఐ వేణుగోపాల్, ఎస్ఐలు, సైబర్ ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-నామ్ బలోపేతానికి కసరత్తు

● ఢిల్లీ నుంచి అధికారుల బృందం రాక

● రాష్ట్రంలో కర్నూలు, ఆదోని మార్కెట్ కమిటీల ఎంపిక




మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం

కర్నూలు అగ్రికల్చర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందించడంతో పాటు మార్కెటింగ్ శాఖకు లక్ష్యం మేరకు సెస్సు రూపంలో ఆదాయాన్ని సాధించేందు కోసం కేంద్రం ఈ-నామ్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఈ విధానం మరింతగా రైతులకు ప్రయోజనం కల్పించేలా అవసరమైన మార్పులు, చేర్పులు చేసి కొత్త డిజిటల్ విధానాన్ని అమలులోకి తెచ్చేందు కోసం కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఒక్కో రాష్ట్రంలో రెండు మార్కెట్ కమిటీల్లో కేంద్రం, రాష్ట్ర ఉన్నతాధికారుల చేత పరిశీలించేందుకు కసరత్తు మొదలు పెట్టింది. ఏపీలో కర్నూలు, ఆదోని మార్కెట్ కమిటీలను మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత ఎంపిక చేసి ఢిల్లీ నుంచి ఉన్నతాధికారుల కమిటీకి పంపించారు. ఢిల్లీలో ఎస్ఎఫ్ఏసీ సంస్థ బిజినెస్ కన్సల్టెంట్ అధికారి అనిల్‌కుమార్ టీం లీడర్‌గా, మరో నలుగురు ఉన్నతాధికారులు బుధవారం కర్నూలు మార్కెట్ యార్డులో పర్యటించారు. వీరు రైతులతో పాటు కమిషన్ ఏజెంట్లు వ్యాపారులతో మాట్లాడారు. ఇప్పటిదాకా ఈ-నామ్‌లో అందుతున్న ప్రయోజనాలతో పాటు మరిన్ని విధానాల రూపకల్పనకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. గురువారం ఆదోని మార్కెట్ యార్డులో పర్యటించి మార్కెట్ కమిటీ అధికారులతో పాటు రైతులు, కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులతో మాట్లాడుతామని కేంద్రం బృందం సభ్యులు తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన బృందంలో ఉన్నతాధికారులు రవీంద్ర చౌహాన్, దీపక్‌వర్మ, దిలీప్ కుమార్, అశోక్ కుమార్ ఉన్నారు. వీరి వెంట కర్నూలు మార్కెట్ కమిటి అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

● శ్రీశైలం డ్యాం 8 గేట్ల ద్వారా సాగర్‌కు వరద



శ్రీశైలం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.80 అడుగులకు చేరుకుంది.

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నీలం సంజీవరెడ్డి శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. ప్రస్తుతం 8 గేట్ల ద్వారా నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో 2,89,670 క్యూసెక్కుల మేర వరద చేరుతోంది. అవుట్‌ఫ్లో 3,02,478 క్యూసెక్కులుగా ఉంది. 8 స్పిల్‌వే గేట్ల ద్వారా 2,16,520 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 20వేల క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 33,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 30,643 క్యూసెక్కులు నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

● జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ జుబేదాబేగం



మాట్లాడుతున్న జుబేదాబేగం

కర్నూలు రూరల్ జూలై 30(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ఐక్యంగా పనిచేయాలని జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ జుబేదాబేగం పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కర్నూలు సిటీ రైల్వేస్టేషన్‌లో కొనేరు సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జుబేదాబేగం హాజరై మాట్లాడారు. హ్యూమన్ ట్రాఫికింగ్ అనేది ఒక సంఘటిత నేరంగా వర్ణించారు. స్టేషన్ మాస్టర్ శేషఫణి, ఆర్పీఎఫ్ సీఐ రామ్‌మోహన్ సంయుక్తంగా మాట్లాడుతూ బహిరంగా ప్రదేశాల్లో ట్రాఫికింగ్ ఎక్కువగా జరుగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు, మౌనిక, మధుసుధాకర్, మున్నాజీరావు పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో...

కర్నూలు లీగల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నిరోధించడానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా నిరోధక కార్యక్రమాన్ని న్యాయసేవాసదన్ భవనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం, నిరక్షరాస్యత, ధనాశతో పలువురు మానవ అక్రమ నివారణకు పాల్పడుతుంటారన్నారు. అలాంటి వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ అక్రమ రవాణా రోజురోజుకు పెరిగిపోతుండటంతో ఐక్యరాజ్య సమితి ప్రతి ఏడాది జూలై 30న మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని నిర్వహించడానికి నిర్ణయించిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మహిళా శిశు సంరక్షణ అధికారిణి నిర్మల, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ విజయలక్ష్మి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరామచంద్రరావు, సులోచన, న్యాయవాది ఆశాబాయి పారా లీగల్ వాలంటీర్లు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో ఆగస్టు 1న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాల బాలికలకు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తు న్నట్లు కార్యదర్శి సుబ్బరత్నాలు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 9, 10, 11 తేదీల్లో గుంటూరు జిల్లా బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాల కోసం 8919409232, 949332 3964 నంబర్లను సంప్రదించాలన్నారు.

మాన్యం భూముల అన్యాక్రాంతం కానివ్వం

- దేవదాయ శాఖ మంత్రి ఆనం



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రులు ఆనం, బీసీ

బనగానపల్లె, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు సంబంధించిన మాన్యం భూములను అన్యాక్రాంతం కానివ్వమని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం బనగానపల్లె పట్టణంలో మంత్రి ఆనంతో పాటు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. నంద్యాల జిల్లాలోని యాగంటి, నందవరం, కొత్తూరు సుబ్రమణ్యేశ్వర తదితర దేవాలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో యాగంటి క్షేత్రాన్ని సందర్శిస్తానన్నారు. నియోజకవర్గంలోని కంబగిరిస్వామి ఆలయం మాన్యం, ఇతర ఆలయ భూముల మాన్యం భూములు అన్యాక్రాంతమైనట్లు మంత్రి దృష్టికి విలేకరులు తీసుకెళ్లారు. ఒక్కసెంటు భూమి కూడా అన్యాక్రాంతం కానీయమన్నారు. యాగంటి క్షేత్రంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి 9 పనులకు రూ.5.94 కోట్ల నిధులు కేటాయించామన్నారు. రెండు పనులు పూర్తికాగా ఏడు పనులు జరుగుతున్నట్లు తెలిపారు.

సప్తరాత్రోత్సవాలకు

మంత్రాలయం ముస్తాబు

● ఆగస్టు 8 నుంచి 14వ తేదీ వరకు నిర్వహణ

● భారీ క్యూలైన్లు, విద్యుత్ దీపాలతో అలంకరణ

● ముమ్మరంగా సాగుతున్న పనులు

● పార్కింగ్, వసతి ఏర్పాట్లు





మహాముఖద్వారానికి రంగులు వేస్తున్న కళాకారులు

మంత్రాలయం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాలకు సర్వం సిద్ధంచేశారు. వచ్చేనెల 8 నుంచి 14వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లుచేశారు. రంగులు, విద్యుద్దీపాలతో అలంకరణ, భారీ క్యూలైన్లు, రెండు కంపార్టుమెంట్లు, వంటి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పార్కింగ్, వసతి, మురికి కాలువల మరమ్మ తులు, వైద్యం, పరిమళ ప్రసాదం కౌంటర్ల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే మధ్వమార్గ్ కారిడార్‌లో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు, ముఖద్వారం పైఅంతస్థులో రెండు కంపార్టుమెంట్లు భక్తులకు ఈఏడాది ప్రత్యేకంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. భక్తులకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శ్రీమఠంలోని అన్నిశాఖల అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర కారిడార్, సంస్కృత పాఠశాల కారిడార్ వద్ద రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరణ పనులు చేపడుతున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

దొర్నిపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాగ్యనగరానికి చెందిన రామాంజనేయులు(40) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందినట్లు ఏఎస్ఐ రంగయ్య తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజనేయులు బుధవారం తెల్లవారుజామున ఇంట్లోనే మృతిచెందాడు. కుటుంబీకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఏఎస్ఐ ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తమ్ముడు నాగాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఇనుప రాడ్లతో దాడి

ఉయ్యాలవాడ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఇనుపరాడ్లతో ఓ వ్యక్తిపై దాడి చేసిన కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామానికి చెందిన భరత్, విష్ణు, చాంద్‌బాషా పాతగొడవలు నేపథ్యంలో చాకలి చిన్న అంకాలుపై బుధవారం ఇనుప రాడ్లతో దాడిచేశారు. ఈదాడిలో అంకాలుకు గాయాలు కాగా హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

కోవెలకుంట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఉరేసుకొని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పట్టణంలోని నాగులకట్ట సమీపంలో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. వివరాలు.. ఆళ్లగడ్డ మండలం బాచుపల్లెతండాకు చెందిన మూడె పవన్‌నాయక్(27) అనే వ్యక్తి కోవెలకుంట్లలోని ఓ ప్రైవేటు కంపెనీలో క్యాషియర్‌గా పనిచేస్తుండేవాడు. ఏడాది క్రితం పవన్‌నాయక్‌కు పెళ్లి అయ్యింది. వారం రోజుల క్రితం కూతురు పుట్టింది. అతడి భార్య పుట్టింటికి వెళ్లింది. అక్కడ ఏం జరిగిందో ఏమో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పవన్‌నాయక్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సమస్యలే కారణమని మృతుడి అన్న బాలస్వామి నాయక్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి .. కేసు నమోదు

బనగానపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీరవోలు గ్రామానికి చెందిన చిన్నరంగయ్య అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన బెలుం బాలచంద్రుడుపై దాడి చేశాడు. ఈ మేరకు బుధవారం చిన్నరంగయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. చెత్త తీసుకువెళ్లే బండిని బాలచంద్రుడు తీసుకు వెళ్తుండగా చెత్త బండి రోడ్డుకు అడ్డుగా పెట్టాడన్న నెపంతో రంగయ్య దాడి చేయగా బాధితుడి ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేశామన్నారు.

కల్వటాలలో అట్రాసిటీ కేసు : సీఐ

కొలిమిగుండ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వటాల గ్రామానికి చెందిన ప్రసాదరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలు.. గ్రామంలో బుధ వారం ప్రసాదరెడ్డి, యాడికి ప్రతాప్ అనే వ్యక్తులు టెంకాయలు పగులగొట్టే విషయంలో ఘర్షణ పడ్డారు. ప్రతాప్‌ను ప్రసాదరెడ్డి కులం పేరుతో దూషించి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు.. దంపతులకు గాయాలు

ఆదోని రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండవగల్లు సమీపంలో ఆర్టీసీ బస్సు బైకును వెనకనుంచి ఢీకొట్టడంతో దంపతులకు గాయాలయ్యాయి. వివరాల మేరకు.. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం కురహాళ్ గ్రామానికి చెందిన దంపతులు లక్ష్మీ, శ్రీనివాస్‌రెడ్డి బైకులో మాధవరం మండలం సింగరాజనహాళ్ గ్రామానికి బయలుదేరారు. కాగా పాండవగల్లు వద్ద బస్సు వీరి బైకును ఢీకొట్టడతో దంపతులు కిందపడి గాయపడ్డారు. వీరిని ఆదోని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు.

672 కర్ణాటక మద్యం బాటిళ్లు స్వాధీనం

- వెయ్యి లీటర్ల బెల్లం ఊట, 75 లీటర్ల సారా పట్టివేత



సూపరింటెండెంట్ రవికుమార్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యంను రవాణా చేస్తున్న డోన్ కొత్తపేటకు చెందిన సంగం నరేష్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.1.80 లక్షల విలువ చేసే 672 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సూపరిం టెండెంట్ రవికుమార్ తెలిపారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా నవోదయ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు చేపట్టారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఐదు సారా కేసుల్లో ఆరుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 75 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. వివిధ పాత కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న 23 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని, జూలై 30(ఆంధ్రజ్యోతి): కౌతాళం మండలం కుంబళనూరు గ్రామం వద్ద కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నటు ఎక్సైజ్ పోలీసులు బుధవారం తెలిపారు. వివరాల మేరకు.. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈఎస్టీఎఫ్ కర్నూలు, ఆదోని ఎక్సైజ్ సిబ్బంది కలిసి మంగళవారం తెల్లవారుజామున దాడులు చేశారు. నిందితులు వెంకోబ, సిద్ధప్ప, నాగేంద్ర రెండు మోటార్ సైకిళ్లపై 20 బాక్సుల మద్యాన్ని తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. సిబ్బందిని ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు అభినందించారు.

అస్వస్థతకు గురై వ్యక్తి మృతి

- ఆర్ఎంపీ వైద్యమే కారణమని బంధువుల ఆందోళన



రంగస్వామి (ఫైల్)

పత్తికొండ, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనగర్ కు చెందిన రంగస్వామి (40)అనే వ్యక్తి బుధవారం అస్వస్థతకు గురై మృతిచెందాడు. కాగా ఆర్ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్ వల్లే తన భర్త మృతిచెందాడని మృతుడి భార్య, బంధువులు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. బాధితుల కథనం మేరకు.. పత్తికొండ పట్టణానికి చెందిన రంగస్వామి పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బుధవారం ఉదయం అస్వస్థతకు గురికావడంతో ఆర్ఎంపీ వద్దకు వెళ్లాడు. ఆర్ఎంపీ సూచన మేరకు అసిస్టెంట్ రంగస్వామికి ఇంజక్షన్ వేశాడు. అనంతరం ఇంటికి వెళ్లగానే రంగస్వామి మరింత అస్వస్థతకు గురై కొద్దిసేపటికే మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆర్ఎంపీపై కేసు నమోదు చేయాలని పత్తికొండ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. కాగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇస్తే విచారణ చేసి కేసు నమోదు చేస్తామని సీఐ జయన్న తెలిపారు.

లారీ దగ్ధం



దగ్ధమైన లారీ

ఆస్పరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలం నలకదొడ్డి గ్రామ బస్టాండు సమీపంలో మంటలు చెలరేగి లారీ దగ్ధమైంది. వివరాల మేరకు.. ఏపీ 39టీబీ 1159 నంబర్ గల వైజాగ్ నుంచి బళ్లారికి హైడ్రోమాక్స్ పౌడర్ లోడుతో వెళ్తున్న లారీ ఇంజన్‌లో వేడి కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే లారీ దిగి పక్కకు వెళ్లాడు. జిందాల్ ఫ్యాక్టరీలో ఇనుము తయారీకి పౌడర్‌ను వాడతారని, పౌడర్ విలువ రూ.47,27,900 కాగా, లారీ విలువ రూ.40 లక్షలని డ్రైవర్ షేక్ మహబూబ్ బాషా తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మస్తాన్‌వలి తెలిపారు.

విద్యుత్ పోరాటానికి సిద్ధం

- పేదల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- హామీల అమలులో చిత్తశుద్ధి చూపాలి
- ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయాలను ముట్టడిస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- ఆకట్టుకున్న ప్రజా నాట్యమండలి నృత్యాలు
- ఎరుపెక్కిన డోన్ పట్టణం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ప్రజా నాట్యమండలి కళాకారుల నృత్య ప్రదర్శన

డోన్ రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమవుతుందని, దీనికి వ్యతిరేకంగా విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో సీపీఐ నంద్యాల జిల్లా రెండో మహాసభ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కార్యకర్తలను, ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీ అమలు కోసం పోరాటాల ద్వారా కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధిని కనబరచాలన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణాల కోసం కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే నిధులు మంజూరుచేసి పేదలను ఆదుకుంటామని ఇచ్చిన హామీని విస్మరిస్తుందన్నారు. వచ్చే నెల 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల ముట్టడికి సిద్ధం కావాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఒంగోలులో వచ్చే నెల 22, 23 తేదీల్లో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలకు కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పల నాగేశ్వరరావు, రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య, రాష్ట్రకార్యవర్గ సభ్యులు జగదీష్, రామాంజనేయులు, నక్కి లెనిన్‌బాబు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, రాధాకృష్ణ, సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ ప్రదర్శన

జిల్లా రెండో మహాసభల సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహం ప్రధాన రోడ్డు నుంచి బస్టాండ్ వరకు సీపీఐ ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు భారీ ప్రదర్శనను నిర్వహిం చారు. పాతబస్టాండు రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రజా నాట్యమండలి కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. నంద్యాల జిల్లాలోని 29మండలాల నుంచి భారీ ఎత్తున సీపీఐ కార్యకర్తలు అభిమానులు తరలి రావడంతో డోన్ ఎర్రజెండాలతో ఎరుపెక్కింది.

కర్నూలు-హోస్పేట్ వయా ఎమ్మిగనూరు

- నూతన రైలు మార్గం కోసం రైల్వే మంత్రికి సీఎం లేఖ



రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు లేఖ ఇస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

కర్నూలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు - హోస్పేట్ వయా ఎమ్మిగనూరు, ఆదోని, తోర్నకల్లు మీదుగా నూతన రైలు మార్గం నిర్మాణం కోసం సీఎం చంద్రబాబు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్‌వైష్ణవ్‌కు లేఖ రాశారు. ఆ లేఖను బుధవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్‌వైష్ణవ్‌కు అందజేశారు. అదే క్రమంలో ఈ రైలు మార్గం నిర్మాణం చేస్తే కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం పారిశ్రామిక, రవాణా రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, సర్వే, డీపీఆర్ తయారు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే బీవీ కూడా మరో లేఖను అందజేశారు. ఇప్పటికే మంత్రాలయం - కర్నూలు వయా ఎమ్మిగనూరు, కోడుమూరు మధ్య 110 కిలో మీటర్ల రైలు మార్గం నిర్మాణం రీసర్వే కోసం రూ.28 లక్షలు కేటాయించారు. తాజాగా కర్నూలు - హోస్పేట్ వయా ఎమ్మిగనూరు, ఆదోని మధ్య మరో నూతన రైలుమార్గం నిర్మాణానికి సీఎం చంద్రబాబు ప్రతిపాదన చేయడంతో ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు నియోజకవర్గాల్లో ప్రగతి పరుగులు పెట్టే అవకాశం ఉంది. ఇది మెరుగైన కనెక్టివిటీ అని, పశ్చిమ ప్రాంతం అభివృద్ధితో దేశ ఆర్థిక ప్రగతికి ఊతం ఇస్తుందని ఆ లేఖలో సీఎం చంద్రబాబు వివరించారు. కర్ణాటక రాష్ట్రం హోస్పెట్, బళ్లారి ప్రాంతంలో ఖనిజ సంపద, ఐరన్‌కు కేంద్రంగా ఉంది. ప్రస్తుతం బళ్లారి, గుంతకల్లు, గుత్తి మీదుగా సరుకు రవాణా, ప్రయాణికుల రాకపోకలు జరుగుతున్నాయని, నూతన రైలు మార్గం నిర్మిస్తే.. తోర్నగల్లు-గుంతకల్లు/గుత్తి రైల్వే కారిడార్‌లోని రద్దీ, రవాణా ఒత్తిడిని తగ్గించవచ్చని వివరించారు. అదే క్రమంలో దక్షిణాది ప్రముఖ పుణ్య క్షేత్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి క్షేత్రాన్ని కలుపుతూ మంత్రాలయం రోడ్ స్టేషన్ నుంచి కొత్తగా ప్రతిపాదించే రైలుమార్గానికి అనుసంధానం (కనెక్టివిటీ) చేస్తే పర్యాటక రంగాన్ని మరింతగా ప్రోత్సహిం చవచ్చని ముఖ్యమంత్రి రాసిన లేఖలో వివరించారు. ఈ విషయంపై ఎంపీ బస్తిపాటి, ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం అభివృద్ధిని కాంక్షిస్తూ నూతన రైలుమార్గం ప్రతిపాదిస్తూ రైల్వే మంత్రి అశ్విన్‌వైష్ణవ్‌కు సీఎం చంద్రబాబు రాసిన లేఖను అందజేశామన్నారు. అలాగే స్థానిక ప్రజాప్రతినిధిగా మరో లేఖను అందజేశామన్నారు. రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. సర్వే, డీపీఆర్ తయారు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

కర్ణాటక గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

ఆదోని రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు చెందిన గ్యాస్ సిలిండర్లను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం శిరుగుప్పకు చెందిన ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అనుమతి లేకుండా ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామంలో విక్రయిస్తున్నారు. సమాచారం మేరకు. రెవెన్యూ, పోలీసులు స్వాధీనం దాడులు చేసి, దాదాపు 94 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తహసీల్దార్ రమేష్, ఇన్స్‌ పోలీసులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో అధికారులు

మాజీ బ్యాంకు మేనేజర్ అరెస్ట్

ఆదోని, జూలై30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాయోగి లకమ్మ బ్యాంకు మాజీ మేనేజర్ కమ్ సీఈవో గట్టు మురళికుమార్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపారు. వివరాల మేరకు బ్యాంకులో సీఈవోగా విధులు నిర్వహించారు. పారిశ్రామికవేత్తలు ఎల్లే మల్లేశప్ప, ఎల్లే చెన్నబసవ, ఎల్లే చైత్ర పొలం పట్టాలు తనఖా పెట్టి నాలుగేళ్ల క్రితం రూ.3.24 కోట్ల రుణం పొందారు. రుణాన్ని తిరిగి చెల్లించకపోవడంతో అనుమానం వచ్చిన బ్యాంకు చైర్మన్ డాక్యుమెంట్లను పరిశీలించగా, అవి నకలీవని తేలింది. సబ్ రిజిస్ట్రార్ సంతకాలు, సీలు సైతం నకిలీవని గుర్తించిన బ్యాంకు చైర్మన్ రాయచోటి సుబ్బయ్య 2025 మార్చి 29న పోలీసులకు ఫిర్యాదు చేశారు. రుణ గ్రహీతలకు మాజీ మేనేజర్ కమ్ సీఈవో గట్టు మురళికుమార్ సహకరించినట్లు ఫిర్యాదులో పేర్కొనారు. ఈ కేసులో బుధవారం రాంజల రహదారిలోని వై జంక్షన్ వద్ద మురళికుమార్‌ను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు, మిగతా నిందితులను కూడా త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

20 ఎకరాల్లో మామిడి మొక్కలు తొలగింపు

- ఇరిగేషన్ భూముల్లో పంటలు సాగు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరిక



మామిడి మొక్కలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కొత్తపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కపిలేశ్వరం-సంగమేశ్వరం మధ్యలో శ్రీశైలం నీటి ముంపు నుంచి బయల్పడిన 20 ఎకరాల్లో రైతులు నాటుకున్న మామిడి మొక్కలను రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. దీంతో మామిడి మొక్కలు నాటుకున్న శ్రీశైలం నీటి ముంపు బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. కపిలేశ్వరం గ్రామానికి చెందిన రైతులు పరమేశ్వర గౌడు, ఎల్లయ్య, నరసింహ, లింగస్వామి, దుబ్బన్న, ఈశ్వరగౌడులకు చెందిన 20 ఎకరాల్లో నాటిన మామిడి మొక్కలను రెవెన్యూ అధికారులు, పోలీసులు గ్రామ సేవకులతో కలిసి తొలగించారు. రైతులు మాట్లాడుతూ 30 ఏళ్లకు పైగా తమ పెద్దల హయాం నుంచి శ్రీశైలం ముంపు నుంచి బయల్పడిన ఇరిగేషన్ భూముల్లో వివిధ రకాల పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. అయితే ఉన్న ఫలంగా రెవెన్యూ అధికారులు పోలీసులతో కలిసొచ్చి నెలకింద నాటిన మొక్కలను పెరికేయడంతో తీవ్రంగా నష్టం కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణిని వివరణ కోరగా శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రభుత్వ భూములను రైతులు ఎలా సాగు చేసుకుంటారని ప్రశ్నించారు. శ్రీశైలం ప్రాజెక్టు చెందిన ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు మామిడి మొక్కలను తొలగించినట్లు తెలిపారు. ఎవరైనా ఈ భూముల్లో పంటలను సాగు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు

తప్పిన ప్రమాదం

- కిందికి దిగిపోయిన తెలుగుగంగ ప్రధాన కాలువ ఐదో బ్లాక్ షెట్టర్ రేకు
- తక్షణమే మరమ్మతులు చేపట్టిన అధికారులు



ఐదో బ్లాక్‌కు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

బండి ఆత్మకూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ ప్రధాన కాలువ ఐదో బ్లాక్ కింద త్రుటిలో ప్రమాదం తప్పింది. మండలంలోని జీసీపాలెం, లింగాపురం, రామాపురం గ్రామాలకు చెందిన వేలాది ఎకరాలకు నీరు అందించే ఐదో బ్లాక్ తూమ్ షెట్టర్ రేకు పూర్తిగా కిందికి దిగిపోయింది. దీంతో రైతులకు నీరు అందక పోగా, రేకు మరింత కిందికి దిగపడిపోతే నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేయటం చాలా కష్టం. ఈ విషయాన్ని ఆయా టీడీపీ గ్రామాల నాయకులు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే గంగ డీఈ మురళీకృష్ణ, ఏఈ అర్జున్ సింగ్‌ను మరమ్మతులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. దీంతో వారు హుటాహుటిన ఐదో బ్లాక్ తూము వద్దకు చేరుకుని, రైతుల సాయంతో దెబ్బతిని కిందకు దిగిపోయిన రేకును మరమ్మతులను చేసి సరిచేశారు. వెంటనే తూము కింద నీటిని వదిలారు. దీంతో రైతుల ఆనందం వ్యక్తం చేశారు.

ఆరేళ్లుగా బీజేపీ కాలయాపన

- రాయలసీమ డిక్లరేషన్‌పై ఎంపీలు ఒత్తిడి తేవాలి
- నేటికీ అమలు కాని 'ఆడబిడ్డ నిధి' హామీ
- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

ఆళ్లగడ్డ, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాయలసీమ డిక్లరేషన్ అమలు చేయకుండా బీజేపీ ప్రభుత్వం ఆరేళ్లుగా కాలయాపన చేస్తుందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ విమర్శించారు. బుధవారం ఆయన ఆళ్లగడ్డలో విలేకరులతో మాట్లాడారు. రాయలసీమ డిక్లరేషన్ అమలుచేసి ప్రత్యేక ప్యాకేజీ కోసం ఎంపీలు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. సీమ అభివృద్ధి కోసం పదకొండేళ్లలో ఎంత బడ్జెట్ కేటాయించారో బీజేపీ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు నెలకు రూ 1500 'ఆడబిడ్డ నిధి' పేరిట ఏటా రూ.18000 ఇస్తామని చెప్పిన హామీ నేటికీ అమలు కావడం లేదన్నారు. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మాల్సి వస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు మహిళల ఆశలపై నీళ్లు చెల్లినట్లు ఉందని విమర్శించారు. సమావేశంలో ఆళ్లగడ్డ సమన్వయకర్త బరగోడ్ల హుసేన్‌బాషా, నంద్యాల పార్లమెంట్ జిల్లా అధికార ప్రతినిధి సంజీవకుమార్, సాధిక్ హుసేన్, హరూన్ రషీద్, రఫి, మహబూబ్‌బాషా, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పుసులూరు గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పల్లె ప్రభాకర్‌రెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, మాదేష్ పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం చంద్రబాబు సంక్షేమ సారధిగా నిలిచారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. మండలంలోని క్రిష్ణాపురంలో బుధవారం డబ్ల్యూయూఏ 7 అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించారు. అనంతరం సుపరిపాలన సర్వే వందశాతం పూర్తి చేసిన దివాకర్, శంకర్‌లను ఎమ్మెల్యే సన్మానిం చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామక్రిష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సురేష్‌బాబు, సాంబశివారెడ్డి, షేక్షావలి, అబ్దుల్‌మియా, నాగేంద్ర, హనుమంతు, అయ్యప్ప, రాజు పాల్గొన్నారు.


ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


క్రిష్ణాపురంలో కరపత్రాన్ని అందిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి


టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీష్ ఆధ్వర్యంలో...

కర్నూలు లీగల్: 43వ వార్డు పరిధిలోని ఇల్లూర్ నగర్, ఇందిరాగాంధీ నగర్‌లో టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు కేఈ జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు నిర్వహిం చారు. ఈ సందర్భంగా జగదీష్ కుమార్ మాట్లాడుతూ వైఎస్ జగన్ చెబుతున్న యాప్‌లో వైసీపీ నాయకుల అరాచకాలను నమోదు చేయాలన్నారు. వైసీపీ ఆకృత్యాలకు గత ఐదేళ్లలో ఎంతో మంది బలయ్యారని ఆరోపించారు. ముందుగా వారి వివరాలను జగన్ తన యాప్‌లో నమోదు చేసుకోవాలని ఎద్దేవ చేశారు. లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాశెట్టి శ్రీనివాసులు, నాయకులు శ్రీనివాసభట్, గణేస్ సింగ్, ధనారెడ్డి, బీజేపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మెహన్, వార్డు ఇన్‌చార్జి రాజశేఖరరెడ్డి, కౌశిక్, నాగేశ్వరరావు, అంజి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి: శాస్త్రవేత్త


పత్తి పంటను పరిశీలిస్తున్న డాట్ సెంటర్ శాస్త్రవేత్త సుజాతమ్మ, అధికారులు

ఓర్వకల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ అన్నారు. బుధవారం మండలంలోని తిప్పాయపల్లె, హుశేనాపురం గ్రామాల్లో రైతులు వేసిన పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. రైతులకు తెగుళ్లపై అవగాహన కల్పించారు. సుజాతమ్మ మాట్లాడుతూ పత్తి పంటలో గులాబి పురుగు నివారణకు పంట వేసిన 25 రోజులకు వేపనూనె, 45-50 రోజులకు ప్రేపోనోపాస్, 115 రోజులకు ఎల్ఏఎండీఏ తరహాలో పిచికారి చేయాలని, పంటలో అక్కడక్కడ లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పెనుబంక తెగుళ్ల నివారణకు ఇమిడాక్లోఫైడ్ 80 మి.మీటర్లు ఎకరాకు డైపెంతూరియన్ 250 మిలీ మీటర్ల నీటితో కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. ఆమె వెంట డీఆర్‌సీ ఏడీఏ జీఎం వేద మణి, ఓర్వకల్లు వ్యవసాయాధికారి మధుమతి, ఏఈవోలు భాస్కర్, మధు, వీఏఏ మాధవీలత, దేవకుమార్, రైతులు ఉన్నారు.

తెల్లదోమపై జాగ్రత్త వహించాలి

కోడుమూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పత్తి పంట సాగులో తెల్లదోమ, పచ్చదోమలపై రైతులు జాగ్రత్తలు వహిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ అన్నారు. కోడుమూరు పరిధిలోని కొండన్న అనే రైతు పంట భూమిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పంట దిగుబడిపై సలహాలు, సూచనలు అందించారు ఏవో మాట్లాడుతూ తెల్ల, పచ్చదోమను నివారించాలంటే వేప నూనెను పిచికారి చేయాలన్నారు. కంది పంటకు నానో యూరి యాను ఎకరాకు 500ఎంఎల్ చొప్పున పిచికారి చేయడం వలన అధిక దిగుబడిని సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలి

కర్నూలు స్పోర్ట్స్, జూలై 30(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. బుధవారం నగరంలోని డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలను డీఎస్‌డీవో జెండా ఊపి ప్రారంభించారు. స్టీఫెన్ హాకింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి మక్బుల్ బాషా, ఉపాధ్యక్షులు వీరాంజి, భగవంతుడు, జిల్లా వికలాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు రాందాస్, పద్మావతి పాల్గొన్నారు.

హంద్రీ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టండి

కర్నూలు రూరల్ జూలై 30(ఆంధ్రజ్యోతి): గోరంట్ల-కొత్తపల్లె మధ్య నిలిచిపోయిన హంద్రీ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్‌హెచ్ ఎర్రగుడి, గోరంట్ల, కొత్తపల్లె, మన్నెకుంట గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హంద్రీనది పరివాహక ప్రాంత గ్రామాల ప్రజల కర్నూ లుకు చేరుకొని కేడీసీసీబీ చైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి వినపత్రం అందజేశారు. 2014లో టీడీపీ అధికారంలో ఉన్నపుడు హంద్రీనది వంతెన నిర్మాణానికి రూ.25కోట్లు మంజూరు చేసిందని వారు గుర్తుచేశారు. ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయిందన్నారు. తర్వాత వైసీపీ హయాంలో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారని దాదాపు దిమ్మెలు పూర్తి అయిన తర్వాత బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేశారని విష్ణుకు వివరించారు. నది దాటాలంటే ఇబ్బందులు పడుతున్నామన్నారు. విద్యార్థులు స్కూ ల్‌కు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి వంతెన నిర్మాణ పనులు పునఃప్రారంభించేలా చొరవ తీసుకోవాలని విష్ణుకు విజ్ఞప్తి చేశారు.


విష్ణువర్ధన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గోరంట్ల, కొత్తపల్లె, ఎర్రగుడి గ్రామస్థులు

మానవ అక్రమ రవాణా నేరం

కర్నూలు కల్చరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నేరమని కర్నూలులోని సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఇకో డెవలప్‌మెంట్ (ఎస్ఆర్ అండ్ ఈడీ) స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ వ్యక్తుల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎస్ఆర్ అండ్ ఈడీ సంస్థ ఆధ్వర్యంలో నగరంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పలు స్వచ్ఛంద, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అతిసారకు ఓఆర్ఎస్, జింక్ మాత్ర తప్పనిసరి

కర్నూలు హాస్పిటల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): అతిసార వ్యాధితో బాధపడే చిన్నారులకు తప్పనిసరిగా ఓఆర్ఎస్ ద్రావణంతో పాటు జింక్ మాత్రలను ఇవ్వాలని సంచార చికిత్స కార్యక్రమం జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు సూచించారు. బుధవారం గార్గేయపురం పీహెచ్‌సీ పరిధిలోని సూదిరెడ్డిపల్లెలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.అబ్దుల్ హనీఫ్, సామాజిక ఆరోగ్య అధికారి జయనాగమణి, పీహెచ్ఎన్ హనుమంతమ్మ, ప్రొజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

చెట్ల కింద పాఠాలు చెప్పొద్దు: ఎంఈవో

సి.బెళగల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): చెట్ల కింద విద్యార్థులకు పాఠాలు చెప్పొద్దని ఎంఈవో ఆదాంబాషా ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని పోలకల్లు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల అవరణలో ఉన్న చెట్లు గాలిలేస్తే విరిగే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట హెచ్ఎం రమా, ఉపాధ్యాయులు ఉన్నారు.

అధిక ఫీజు వసూలు చేస్తే చర్యలు

గూడూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖ అధికారి సునీలమ్మ హెచ్చరించారు. బుధవారం గూడూరులోని భారతీయ విద్యా మందిర్ ప్రైవేటు పాఠశాలను ఎంఈవో తనిఖీ చేశారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

కోడుమూరు రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుగొండ జడ్పీ ఉన్నత పాఠశాలను ఎంఈవో-2 అనంతయ్య యాదవ్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. పాఠాలను శ్రద్ధగా వింటూ సందేహాలను నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనం తరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌కు సీలింగ్ ఫ్యాన్లు విరాళం

కర్నూలు హాస్పిటల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్స్ కాలనీలో ఉన్న బీసీ హాస్టల్‌కు సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ 8 సీలింగ్ ఫ్యాన్లను విరాళంగా ఇచ్చారు. బీసీ హాస్టల్‌లో సమస్యలను వార్డెన్ రమేష్ ద్వారా తెలుసుకున్న డాక్టర్ శంకర్‌శర్మ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే సీలింగ్ ఫ్యాన్లను వార్డెన్‌కు అందించారు.


వార్డెన్‌కు ఫ్యాన్లు అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

సత్యనారాయణ రెడ్డి మృతి టీడీపీకి తీరని లోటు

గూడూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు జులకల్లు సత్యనారాయణ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం గూడూరు మండలం జులకల్లు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సత్యనారాయణ రెడ్డి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, కేడీసీసీబీ చైర్మన్ జులకల్లు గ్రామానికి చేరుకోని సత్యనారాయణ రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వీరి వెంట మండల టీడీపీ అధ్యక్షుడు జె సురేష్, సింగిల్‌విండో అధ్యక్షుడు బి.దానమయ్య, డైరెక్టర్ రేమట వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు సృజన్, నీటి సంఘం అధ్యక్షుడు మహేశ్వర రెడ్డి, పౌలు ఉన్నారు.

● గూడూరు మండలం చనుగోండ్ల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే దస్తగిరి పరామర్శించారు.

ధర్నాను జయప్రదం చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆగస్టు 2న అన్ని జిల్లాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయాలని నిర్ణయం తీసుకున్నామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్, కర్నూలు జిల్లా ఫ్యాప్టో ఇన్‌చార్జి కాకి ప్రకాష్‌రావు, ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.హృదయరాజు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో కర్నూలు జిల్లా ఫ్యాప్టో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక అంశాలపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కొత్తగా ప్రమోషన్, బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలల జీతాలు చెల్లించలేదన్నారు. సమావేశంలో జిల్లా ఫ్యాప్టో చైర్మన్ సేవాలాల్ నాయక్, సెక్రటరీ జనరల్ భాస్కర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, ప్రధాన కార్యదర్శి జనార్దన్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కర్నూలు రూరల్ జూలై 30(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం బూడిదపాడు గ్రామానికి చెందిన వంగూరు మధుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.4,13163 లక్షల చెక్కును కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి బుధవారం అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మధుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో ఆపరేష న్‌కు చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఎమ్మెల్యేని కలిశారు. ఎమ్మెల్యే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయా లని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి మధుకు ఆపరేషన్ అవసరమ య్యే ఆర్థిక సాయాన్ని మంజూరు చేయించారు.

విద్యార్థుల భోజనంపై ఆరా

కర్నూలు అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని 48వ వార్డు కారల్ మార్క్స్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్‌ను రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు సూరి మన్సూన్ ఆలీఖాన్ సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం మెనూ రుచి, శుభ్రతపై ఆరా తీశారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి ఊరేగింపునకు అనుమతి

కర్నూలు కల్చరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): కోట్ల విజయభాస్కర్ రెడ్డి నగర్‌లో ఆగస్టు 16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, ఆగస్టు 17న ఊరేగింపు నిర్వహించుకునేందుకు నాలుగో పట్టణ సీఐ విక్రమ సింహ అనుమతి ఇచ్చారని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు నాగయ్య తెలిపారు. బుధవారం త్రైత సిద్ధాంత పుస్తకాలను సీఐకి అందజేశారు. సభ్యులు రామ్మో హన్, వాసు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

కల్లూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. నగరంలోని రాఘూరి ఫంక్షన్‌హాల్లో బుధవారం కల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా దేవులంకాటి శేఖర్ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, ఏపీ సీడ్స్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి హాజరై కల్లూరు పీఏసీఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయనతో పాటు డైరెక్టర్లుగా మాచిరెడ్డి కాంతమోహన్‌రెడ్డి, గొల్ల లక్ష్మన్నలను ఆశాఖ సీఈఓ పుల్లయ్య ప్రమాణం చేయించారు. గౌరు చరిత మాట్లాడుతూ వ్యవసాయ రం గాన్ని గాడిలో పెట్టి, రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు చర్యలు చేపట్టారని తెలిపారు. అనంతరం గౌరు వెంకటరెడ్డి, ధర్మవరం సుబ్బారెడ్డి, దేవులంకాటి శేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో పాణ్యం పరిశీలకుడు ఆదెన్న, డి.రామాంజనేయులు, కె.పార్వతమ్మ, పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, ఈవీ రమణ, వాకిటి మాదేష్, శ్రీనివాసులు, దేవేంద్రారెడ్డి, మేకల శేషన్న పాల్గొన్నారు.

పేదల కడుపునింపేందుకే అన్న క్యాంటీన్లు: పేదల కడుపునింపేందుకు ప్రభుత్వం అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకువస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులోని నంద్యాల చెక్‌పోస్టులో రూ. 61 లక్షలతో అన్న క్యాంటీన్ నిర్మాణానికి కమిషనర్ పి. విశ్వనాథ్‌తో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.

● 37వ వార్డు ఉల్చాల సర్కిల్‌లో బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్ర మంలో ఎమ్మెల్యే గౌరుచరిత పాల్గొన్నారు. నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, టీడీపీ వార్డ్ ఇన్‌చార్జి రాఘవేంద్ర, ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్పొరేటర్ ఆయేషాసిద్దికా, జవ్వాజి గంగాధర్‌గౌడ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


చైర్మన్ దేవులంకాటి శేఖర్ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న గౌరు దంపతులు

2న నగర పాలక సర్వసభ్య సమావేశం

కర్నూలు న్యూసిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): నగర పాలక సర్వసభ్య సమావేశం ఆగస్టు 2న నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుందని, ఈసమావేశానికి మంత్రి టీజీ భరత్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, మేయర్ బీవై రామయ్య, డిప్యూటీ మేయర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరవుతారణి తెలిపారు. సమావేశంలో 19 అంశాల అజెండాపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని కమిషనర్ పేర్కొన్నారు.

యూరియా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

సి.బెళగల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): యూరియాను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ సాలురెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి రైతు భరోసా కేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో మల్లేష్‌కుమార్, కోడుమూరు ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్ గౌడు, ఎంపీఈవోలు హనిఫ్ బాషా, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

కర్నూలు న్యూసిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 9, 10, 11 తేదీల్లో నగరంలో జరిగే సీపీఐ 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్నాథం పిలుపునిచ్చారు. బుధవారం సీఆర్ భవన్‌లో మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప, నగర సహాయ కార్యదర్శి జి.చంద్రశేఖర్, సి.మహేష్, వెంకటేష్, బీసన్న పాల్గొన్నారు.

నేడు సీనియర్ అసిస్టెంట్ పదవీ విరమణ

కర్నూలు న్యూసిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న పట్వేఘర్ సాధిక్ హుస్సేన్ గురువారం పదవీ విరమణ చేయనున్నారు. 1981లో రికార్డు అసిస్టెంట్‌గా విధుల్లో చేరిన ఆయన 1987లో బిల్ కలెక్టర్‌గా, 2009లో జూనియర్ అసి స్టెంట్‌గా, 2024లో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. 18 సంవత్సరాలకే ఉద్యోగంలో చేరిన సాధిక్ హుస్సేన్ 43 సంవత్సరాల 7 నెలలు బాధ్యతలు నిర్వహించారు. నగర పాలక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిగా పదవులు అలంకరించారు. 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు లయన్స్ క్లబ్ అధ్వర్యంలో సన్మానించారు. సాధిక్ హుసేన్‌కు భార్య రిజ్వానా బేగమ్(ప్రభుత్వ టీచర్), ముగ్గురు కుమారులు ఉన్నారు.


సాధిక్ హుస్సేన్

యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా నాగమధు యాదవ్



కర్నూలు అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా నాగమధు యాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు కాంగ్రెస్ అధిష్ఠానం ఉత్తర్వులు జారీచేసిందని పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. నాగమధుయాదవ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా జాతీయ కార్యదర్శిగా నియమించారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యువజన కాంగ్రెస్‌ను బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

బాలుయాదవ్‌కు అభినందనలు

కర్నూలు అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాజకీయ, భక్తి పాటలు పాడుతున్న గాయకుడు ఏసీ బాలు యాదవ్(బాలుడు)ను భారతీయ చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపకుడు రామచంద్రయాదవ్ అభినందించారు. విజయవాడలో పార్టీ ఆవిర్భావ వేడుకల్లో రెండో సభలో ఆయన పాడిన పాటలపై హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని చిందుకూరు గ్రామానికి చెందిన ఆయన పాటలు, రచన, పాడటంలో ఆయన ప్రత్యేకత సంపాదించుకున్న తీరు పలువురు యువ గాయకులకు ఆదర్శమని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన పాడిన పాటలకు యువగళం పాదయాత్రలో అప్పట్లో నారా లోకేశ్ ఆయన్ను అభినందించారు.

స్మార్ట్ మీటర్లపై పోరాటం

కర్నూలు న్యూసిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల భారాలు, స్మార్ట్ మీటర్లపై పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు టి.రాముడు పిలుపునిచ్చారు. బుధవారం ఇందిరాగాంధీ నగర్‌లోని యువజన సంఘం కార్యాలయంలో బి.కృష్ణ 14వ వర్ధంతి సభను పురస్క రించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాముడు మాట్లాడుతూ అప్పటి టీడీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ చార్జీల భారాన్ని వ్యతి రేకిస్తూ చలో అసెంబ్లీ సందర్భంగా బషీర్‌బాగ్‌లో జరిగిన కాల్పుల్లో కృష్ణ వీరోచితంగా పోరాడి పోలీసుల చేతిలో ఉన్న గన్ను లాక్కుని విసిరి వేశారని గుర్తు చేశారు. ఆయన పోరాట స్ఫూర్తిని యు వత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు వి.శంకర్, కె.విక్రమ్, హుస్సేన్, అలివేలు, జమున, భాగ్యమ్మ పాల్గొన్నారు.

నేడు సుదర్శన తిరునక్షత్రం వేడుకలు

కర్నూలు కల్చరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): నగర శివారులో మామిదాల పాడులోని గోదా గోకుల క్షేత్రంలో శ్రావణ మాసం సందర్భంగా గురువారం సుదర్శన తిరునక్షత్రం వేడుకలు నిర్వహిస్తున్నట్లు గోదా గోకులం వ్యవ స్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం చిత్తా నక్షత్రాన్ని పురస్క రించుకొని ఉదయం వేకువ జామున సుదర్శన స్వామివారి మూలవర్లకు, ఉత్సవ వర్లకు అభిషేకాలు, ఉదయం 7 గంటలకు గోష్ఠి, ఉదయం 8 గంట లకు శ్రీదేవీ భూదేవీ సమేత రంగనాథస్వామివారి నిత్య కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు సుదర్శన నారసింహ హోమం మధ్యాహ్నం 12.30 గంటలకు పూర్ణాహుతి, ఒంటి గంటకు మధ్యాహ్న గోష్ఠి, రాత్రి 7 గంటలకు సుదర్శన ఆళ్వార్‌ను పల్లకీలో ఆలయ చుట్టూ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

వర్షం కోసం చెక్క భజన

సి.బెళగల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనదొడ్డి, కంబందహాల్, మారందొడ్డి, గొల్లలదొడ్డి, బ్యాతోలి గ్రామాల్లో వర్షం కోసం చెక్క భజనలు ప్రారంభించారు. చెక్కభజన బృందాలు మాట్లాడుతూ గత 15 రోజుల వర్షం రాకపోవడంతో పంటలు ఎండు దశలో ఉన్నాయన్నారు. వర్షం కురుస్తుందనే నమ్మకంతో చెక్క భజనలు చేస్తున్నామన్నారు.

పెట్రోల్ బంకు పరిశీలన

కర్నూలు న్యూసిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): 19వ వార్డు జొహరాపురం రోడ్డులో నగర పాలక సంస్థ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న పెట్రోలు బంకు పనులను కమిషనర్ పి.విశ్వనాథ్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక ఆధ్వర్యంలో త్వరలో మరో పెట్రోల్ పంప్ ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దామోదరం సంజీవయ్య పార్కులో సౌకర్యా లపై స్థానికులను ఆరా తీశారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, డీఈఈ నరేష్, ఏఈ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.


పెట్రోల్ బంకును పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథ్

నేడు ఎడవలికి ఎమ్మెల్యే

మద్దికెర, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడవలి గ్రామం వద్ద హంద్రీనీవా తూము ప్రారంభానికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు రానున్నట్లు టీడీపీ నాయకులు ఎస్.లక్ష్మినారాయణ, ఈడిగ చంద్రశేఖర్ గౌడ్, జమేదార్ జంబునాథ్ రాయుడు తెలిపారు. బుధవారం మాట్లాడుతూ శివారులోని కాలువ 141వ తూమును ఎమ్మెల్యేలు శ్యాంబాబు, గుమ్మనూరు ప్రారంభిస్తారన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

మద్దికెర, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ బండారు సుహాసిని కోరారు. బుధవారం సచివాలయంలో పంచాయతీ పాలక వర్గ సమావేశం నిర్వహించారు.


మాట్లాడుతున్న సర్పంచ్ సుహాసిని

పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సహకరించారన్నారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు రంగమ్మ కుంట, మద్దమ్మ కుంటలో పూడిక తీశామని, పంచాయతీ స్థలాలు ఎవరైనా ఆక్రమిస్తే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా చూస్తామని, కార్మికులు సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. ఉప సర్పంచ్ కవిరెడ్డి కృష్ణ, సభ్యులు ఎస్.లక్ష్మినారాయణ, జంబునాథ్ రాయుడు, బాలచంద్ర, కార్యదర్శి శివకుమార్ ఉన్నారు.

బీజేపీలోనే కొనసాగుతా


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను కలిసిన ప్రకాష్ జైన్

ఆదోని టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తాను బీజేపీలోనే కొనసాగుతానని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ అన్నారు. బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను కలిశానని, ఆయన సూచనల మేరకు కొనసాగనున్నట్లు తెలిపారు. పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు.

బీసీలకు రక్షణ చట్టం తేవాలి


మాట్లాడుతున్న బీసీ ఫెడరేషన్ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తేవాలని ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చాలన్నారు. స్థానిక ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మిచాల న్నారు. శేషన్న, శేక్షావలి, రాజేశ్వరరావు, వీరేష్, వీరభద్ర, రాముడు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఆస్పరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో నిర్వహించనున్న సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ నాయకులు విరుపాక్షి, కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఆగస్టు 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న సభల పోస్టర్లను విడుదల చేశారు. రామంజిని, రంగప్ప, బజారి, మహానంది, పెద్దయ్య ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి

ఆదోని, జూలై30(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకుని అధికారులకు నివేదిస్తామన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, ఉచితంగా మూడు సిలిండర్లు అందిస్తున్నామన్నారు. మాజీ కౌన్సిలర్ రామచంద్ర, ఫక్రుద్దీన్, బుద్ధారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు


కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని టీడీపీ పరిశీలకుడు ఆదినారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు వివరించారు. ఎమ్మెల్యే శ్యాంబాబు నేతృత్వంలో మండలం అభివృద్ధి చెందుతోందన్నారు. జమేదార్ రాజన్న యాదవ్, ఎస్.లక్ష్మినారాయణ, కృష్ణ, భీమరాజు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు

పత్తికొండటౌన్, జూలై30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమ్మరివీధి, లక్ష్మీనగర్ ప్రాంతాల్లోలో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయని ట్రాన్స్‌కో ఏఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం కాలనీల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికాలకు నివేదిక పంపడంతో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేశారని, కాలనీవాసులు సహకరించాలని కోరారు. లైన్ ఇన్‌స్పెక్టర్ దేవేంద్రప్ప, సిబ్బంది పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

నీరులేని ట్యాంకులు


ఎడవలిలో నిరుపయోగంగా ట్యాంకులు

మద్దికెర, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడవలి గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు మినీ నీటి ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. ప్రజలకు తాగునీరు అందించేందుకు వీటిని ఏర్పాటు చేశారు. అయితే చిన్న మరమ్మతుల కారణంగా తాగునీరు వదలడం లేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి, నీటితో నింపాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి పరమేశ్వరప్ప మాట్లాడుతూ ట్యాంకులకు మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తెస్తామని తెలిపారు.

అదనపు హాస్టళ్లను ఏర్పాటు చేయాలి



ఆర్ట్స్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న పీడీఎస్‌వో నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సౌకర్యార్థం అదనపు హాస్టళ్లను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌వో ఆదోని డివిజన్ ప్రధాన కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి ఆందోళన చేశారు. హాస్టల్ సీటుకోసం వెళితే, సీట్లు లేవని వార్డెన్లు వెనక్కి పంపుతుండటంతో చాలామంది చదువు మానేస్తున్నారన్నారు. హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. రాజేష్, వసంత, మల్లి, స్వామి, సమర్థ, నరసింహులు, జాస్వరాజ్, అర్జున్, సత్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


20వ వార్డు మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పత్తికొండ, జూలై 30(ఆంధ్రజ్యోతి): సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని 20వ వార్డులో ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం రూ. 4వేల పింఛన్, తల్లికి వందనం, వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ ఇస్తోందన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు అమలుచేస్తామ న్నారు. ముత్యాల తిరుపాలు, బీటీ గోవిందు, గాదెలింగన్న, రవి, ప్రకాశ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ వరం

వైద్య చికిత్స చేయించుకున్న బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ వరమని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. మండలంలోని దూదెకొండకు చెందిన న్యాయవాది చంద్రశేఖర్‌నాయుడుకు రూ.91,260, వెల్దుర్తి మండలం నరసాపురంకు చెందిన షణ్ముఖ కార్తిక్‌కు రూ10,8058 బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ'

వెల్దుర్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని కౌలు రైతులకు కూడా వర్తింపచేయనున్నట్లు ఏవో అక్బర్‌బాషా అన్నారు. బుధవారం రామళ్లకోట గ్రామ రైతుసేవా కేంద్రంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. రెండు విడతల్లో రూ.20 వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. కౌలు రైతులు వీఆర్వోను సంప్రదించి కౌలు కార్డులు పొందాలన్నారు. వేరుశనగ, పత్తి, కంది, ఆముదం, వరి, ఉల్లి, మిరప, సజ్జ, కొర్ర, మొక్కజొన్న పంటలకు రుణాలు తీసుకున్నవారు బ్యాంకుల్లో పంటల బీమా నమోదుచేసుకోవాలన్నారు.


మాట్లాడుతున్న ఏవో అక్బర్‌బాషా

రాష్ట్రాభివృద్ధికి సీఎం కృషి



వీరభద్రగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

దేవనకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. బుధవారం 'సుపరిపాలన-తొలిఅడుగు'లో భాగంగా దేవనకొండ బీసీ కాలనీ, ప్రధాన రహదారి, బీసీ కొట్టాలలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. ఆగస్టులో రైతుసంక్షేమం, మహిళలకు ఉచితబస్సు ప్రారభిస్తామన్నారు. అంతకు ముందు బైక్ ర్యాలీ న్విహించారు. నాయకులు వీరబద్రగౌడ్‌ను భారీ గజమాలతో సన్మానించారు. బడిగింజల రంగన్న, సుభాన్, వెంకటస్వామిగౌడ్, ఆకుల వీరేష్, సిద్ద, కప్పట్రాళ్ల మల్లికార్జున పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

హాలహర్వి, జూలై 30(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వీరభద్రగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని అమృతాపురం గ్రామంలో మాట్లాడుతూ ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ కింద రైతుల ఖాతాల్లో రూ.7 వేలు జమ చేస్తారన్నారు సర్పంచ్ మల్లికార్జున, హరిరెడ్డి పాల్గొన్నారు.

గ్రేడింగ్ స్వస్తికి సహకరించాలి


మాట్లాడుతున్న యార్డు కార్యదర్శి కల్పన

ఆదోని అగ్రికల్చర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు నష్టం కలిగించే వేరుశనగ గ్రేడింగ్ (పాసింగ్)కు స్వస్తి పలికేందుకు సహకరించాలని మార్కెట్ యార్డ్ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి ఎం.కల్పన కోరారు. బుధవారం వేరుశనగ వ్యాపారులు, హమాలీలతో సమావేశమయ్యారు. మార్కెటింగ్ చట్టంలో లేని పాసింగ్‌ను కూలీలతో చేయించడం నేరమన్నారు ఈనామ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. హమాలీలు సహకరిస్తామని తెలిపారు. తిమ్మప్ప, కాశీ, వెంకటేష్, వెంకప్ప పాల్గొన్నారు.

స్థానికులకే నీరు ఇవ్వాలి

మద్దికెర, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామలోని పురాతన మద్దమ్మ బావి నీటిని స్థానికులకే ఇవ్వాలని కాలనీవాసులు కోరారు. బుధవారం సర్పంచ్ బండారు సుహాసిని, పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. 500 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారని ఈ నీటిని తమ అవసరాలకే ఇవ్వాలని, ఇతర ప్రాంతాలకు తరలించవద్దన్నారు. ఆకుల ఖాజావలి, టైలర్ గోపాల్, కోనప్ప ఉన్నారు.

ఇన్‌చార్జి కార్యదర్శిగా రామాంజనేయులు

ఆలూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మేజర్ గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా రామాంజనేయులు బుధ వారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రభాకర్‌రావు పదోన్నతిపై నంద్యాల జిల్లా ప్యాపిలి డిప్యూటీ ఎంపీడీఓగా వెళ్లారు. దీంతో గూళ్యం పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులును ఇన్‌చార్జిగా నియమించారు.



వేలం వాయిదా

ఆదోని టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ దుకాణాల వేలాను వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 13 షాపుల వేలాలు బుధవారం నిర్వహించాల్సి ఉండగా, ఆగస్టు 14వ తేదీకి వాయిదా వస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, నాయి బ్రాహ్మణులు, రజకులు, బీసీలకు రిజర్వేషన్ ప్రకారం షాపులను కేటాయిస్తామన్నారు.

వేధించడం సరికాదు

ఆదోని టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాల కస్తూర్బా గాంధీ ప్రిన్సిపాల్‌ను బీజేపీ నాయకులు వేధించడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం ప్రిన్సిపాల్‌ను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఆదివాసీల సంఘం చైర్మన్ మారుతిరావు, జిల్లా నాయకుడు దిలీప్ ధోకా పాఠశాలలో ప్రిన్సిపాల్‌ను కలిశారు. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పలు అవార్డులు అందుకొన్న ఉద్యోగిని బీజేపీ నాయకుడు వేధించడాన్ని ఖండించారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా స్పందించ లేదన్నారు. సాయినాథ్, శ్రీనిత్ ఉన్నారు.

బీమా చేసుకోండి

పత్తికొండ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులు తమ పంటలకు వాతావరణ బీమా నమోదు చేసుకోవాలని ఏవో వెంకటరాముడు సూచించారు. బుధవారం మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ వరకు ప్రభుత్వం గడువును పొడిగించిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితుల్లో ఈ బీమాతో పంట నష్ట పరిహారం వస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్వే చేయండి

హాలహర్వి, జూలై 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పంచాయతీ స్థలాలను, గృహాలను పక్కాగా సర్వే చేయాలని డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, వీఆర్వోలు సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. గ్రామ కంఠాలను, పబ్లిక్ స్థలాలను గుర్తించి రికార్డుల్లో భద్రపరచాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంతో గిరిజనుల అభివృద్ధి

తుగ్గలి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలో గిరిజనుల అభివృద్ధి చెందుతున్నారని టీడీపీ నాయకుడు వెంకస్వామి పత్తికొండ మార్కెట్ యార్డు లక్ష్మీదేవి అన్నారు. బుధవారం మాట్లాడుతూ తనను డైరెక్టర్‌గా ఎంపిక చేసిన పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన రైతులకు ఇబ్బందులు లేకుడా కృషి చేస్తామన్నారు. రమావత్ వీరు నాయక్ తదితరులు ఉన్నారు.

రహదారిపై పశువులు

● వాహనదారుల ఇబ్బందులు

ఆలూరు, జూలై30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూరు-బళ్లారి జాతీయ రహ దారిపై పశువులు తిష్ట వేస్తున్నాయి. దీంతో రోడ్డుకు అడ్డంగా పడుకుని వుండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వేగంగా వచ్చే వాహనాలనకు అడ్డంగా పశువులు వెళుతుండగా ప్రమదాలకు ఆస్కారం ఉంది. ఈ మార్గంలో లారీలు, స్కూల్ బస్‌లు, ఆర్టీసీ, కర్ణాటక బస్సులు, ఆటోలు వెలుతూ నిత్యం రద్దీగా ఉంటుంది. పంచాయతీ అధికారులు, పోలీసులు స్పందించి, పశువులను గోశాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.


రహదారిపై తిష్ఠవేసిన పశువులు

వార్డెన్‌కు సన్మానం


వార్డెన్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

ఆలూరు, జూలై30(ఆంధ్రజ్యోతి): బదిలీ అయిన బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ సంపత్ కుమార్‌ను విద్యార్థులు బుధవారం సన్మానించారు. బుధవారం హాస్టల్‌లో మాట్లాడుతూ ఏడేళ్లపాటు పనిచేసి తమను బాగా చూసుకున్నారని ఉద్వేగభరితంగా వీడ్కోలు పలికారు. తండ్రిలా ఆదరించిన వార్డెన్ సార్‌ను మరువలేమన్నారు. కార్యక్రమంలో వార్డెన్ అనిమిరెడ్డి పాల్గొన్నారు.

గుంతలను పూడ్చారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తుగ్గలి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంది మడుగుల గ్రామంలో రోడ్డుపై ఉన్న గుంతలను పంచాయతీ అధికారులు బుధవారం పూడ్చివేశారు. ఈ నెల 28న 'తవ్వారు.. వదిలేశారు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరి మాట్లాడుతూ గుంతలు, మట్టికుప్పలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న ఫిర్యాదుతో కాంక్రీట్ వేసి గుంతలను పూడ్చామన్నారు. సర్పంచ్ చౌడప్ప, సలహాదారుడు ప్రతాప్ యాదవ్ ఉన్నారు.


గుంతలు పూడ్చేందుకు వేసిన ఇసుక, కంకర

పంచాయతీ అభివృద్ధికి పాటుపడాలి


మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు

పత్తికొండ టౌన్, జూలై30(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అభివృద్ధికి సభ్యులు పాటుపడాలని గౌరవ సలహాదారులు నాగరత్నమ్మ, డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు కోరారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొమ్ము దీపిక అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. సభ్యులు సమస్యలను పరిష్కరించాలని కోరగా, పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఉప సర్పంచ్ పల్లె కళావతి, వార్డుమెంబర్లు లింగన్న, రామాంజినేయులు, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ విరాళం

ఆలూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హత్తిబెళగల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు దత్త పవర్ ఇన్‌ఫ్రా కంపెనీ కంప్యూటర్, ప్రింటర్‌ను విరాళంగా అందించారు. బుధవారం సంస్థ ప్రతినిధులు కీర్తిరాజ్, అంజలి ధనావత్ పాఠశాలలో హెచ్‌ఎం రామసుబ్బయ్యకు అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తాము సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. హెచ్‌ఎం కంపెనీ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సౌరవ్‌మిశ్రా, తలారి శ్రీకాంత్, గణేష్ జె.వి.సయ్యద్‌బాషా, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.



కంప్యూటర్, ప్రింటర్‌ను అందిస్తున్న ప్రతినిధులు

సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో శాంతి హోమాలు

మద్దికెర, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మద్దమ్మకుంట సమీపాన వెలసిన సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో పురోహితులు శాంతి హోమాలు నిర్వహించారు. బుధవారం ఆలయంలో మూలవిరాట్ సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు విజయప్రసాద్‌యాదవ్ మాట్లాడుతూ గ్రామంలోని మంచి పంటలు పండి దిగుబడి సాతిటంచాలని హోమాలు చేస్తున్నట్లు తెలిపారు. అంతేగాక నక్షత్రదోషం, కుజగ్రహ కాలసర్పదోష రాహుకేతన నివారణ పూజల్లో భాగంగా సామూహిక హోమాలు, అభిషేకాలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా కసాపురం గ్రామానికి చెందిన ఓబులేసు లక్ష్మీదేవి దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు, రాత్రి భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న పురోహితులు

రైల్వే గేట్ పడితే నరకం

● వందల సంఖ్యలో వాహనాలు..


రైలు వచ్చిందంటే ఇంతే..


రైలు వెళ్లాక ట్రాఫిక్ జాం

ఆదోని అగ్రికల్చర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీఎస్పీ బంగ్లా నుంచి ఆర్‌ఆర్ లేబర్ కాలనీ, రాజసాబ్ బంగ్లా వెళ్లే దారిలో రైల్వే గేటు ఉంది. అయితే ఈ మార్గంలో నిత్యం భారీగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గేటు పడిందంటే చాలు, భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి. పట్టణంలో ట్రాఫిక్ పెరగడంతో డీఎస్పీ బంగ్లా మీదుగా రాజా సాబ్ బంగ్లా, శ్రీ సాయి నగర్, క్రాంతి నగర్, రాజీవ్‌గాంధీ నగర్, ఆర్‌ఆర్ లేబర్ కాలనీ, కల్లుబావితో పాటు డణాపురం గ్రామానికి వేలాదిగా రాకపోకలు సాగిస్తుంటారు. రైలు వెళ్లిపోయాక గేటు తీయగానే పరిస్థితి దారుణంగా ఉంటోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల, కళాశాలకు వెళ్లే సమయాల్లో గేటు పడితే విద్యార్థులు నరకం అనుభవించాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణానికి ఇప్పటికే నిధులు మంజూరవగా, మంగళవారం సబ్‌కలెక్టర్ పరిశీలించి వెళ్లారు. వంతెన పనులను వెంటనే ప్రారంభించాలని కోతున్నారు.

ఎమ్మిగనూరు

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ఉత్సవాలకు ఆహ్వానం



మంత్రి ఆనం రాం నారాయణ రెడ్డికి ఆహ్వాన పత్రికను ఇస్తున్న ఏఏవో మాధవశెట్టి, సూపరింటెండెంట్ అనంతపురాణిక్

మంత్రాలయం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 354వ సప్తరాత్రోత్సవాలకు రావాలని రాష్ట్ర దేవదాయ, రోడ్లు భవనాల శాఖామంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డిలకు శ్రీమఠం ఏఏఓ మాధవశెట్టి, సూపరింటెండెంట్ అనంత పురాణిక్ కోరారు. బుధవారం బనగానపల్లెలోని బీసీ జనార్దన్ రెడ్డి నివాసంలో మంత్రులను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అలగే మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఇచ్చిన మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం అందజేశారు. వీరివెంట దేవదాయశాఖ కర్నూలు డీసీ గురుప్రసాద్, జిల్లా జేఈవో పాండు రంగారెడ్డి పాల్గొన్నారు.

భూసమస్యలను రైతులు పరిష్కరించుకోవాలి

పెద్దకడబూరు , జూలై 30(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను రైతులు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ గీతా ప్రియదర్శిని సూచించారు. బుధవారం మండలంలోని నౌలేకల్ గ్రామంలో రీ సర్వే పూర్తి కావడంతో గ్రామ సభను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాదిలోపు భూ సమస్యలు ఏవైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. సర్వే సమయంలో రైతులు అధికారులకు సహకరించాలన్నారు. రైతులు భూ సమస్యల వలన గొడవలకు పాల్పడరాదన్నారు. సమావేశంలో డీటీ లలిత, వీఆర్వో ఆదెప్ప, సర్వేయర్ రామాంజనేయులు, టీడీపీ నాయకులు నరసప్ప, మునెప్ప, బసప్ప, నాగేష్, రైతులు పాల్గొన్నారు.

సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పేదలకు నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సీఎస్‌డీటీ చంద్రకళ సూచించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం, బ్యాళ్లు తదితర సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే సహించేదిలేదన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి పేదవాడికి రేషన్ సక్రమంగా అందించాలన్నారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రేషన్ దుకాణాలను తెరవాలన్నారు. 60ఏళ్లపైబడిన వారికి ఇంటి దగ్గరకు వెళ్లి రేషన్ అందజేయాలన్నారు. రేషన్ పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దకడబూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం పెద్దకడబూరులో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ మొబైల్ ద్వారానే అధికశాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఓటీపీలు చెప్పరాదన్నారు. తెలియని యాప్‌లు, మెసెజ్‌ల లింక్‌లను టచ్ చేయరాదని సూచించారు. మహిళల, చిన్నారులపై అఘాత్యాలకు పాల్పడిన, మత్తు పదార్థాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాలు విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో గ్రామస్థులు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి

ఎమ్మిగనూరు జూలై 30(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులను, చేనేత పరిశ్రమను కాపాడుకునేందుకు గురువారం పట్టణంలోని పద్మశాలీ కల్యాణమండపం దగ్గర నిర్వహిస్తున్న చేనేత పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని చేనేత జనసమాఖ్య నాయకుడు శంకరన్న కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నాయకులు బండా నీలకంఠ, నాగరాజు, బీసీ నాయకులు కామళే గణేష్, రామచంద్రతో కలిసి ఆయన మాట్లాడారు. చేనేత సమస్యలను పాలక ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి చేనేతరంగాన్ని కాపాడుకునేందుకు నిర్వహిస్తున్న సదస్సుకు ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నాగమధుయాదవ్ ఎంపికపై హర్షం

ఎమ్మిగనూరు జూలై 30(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాకు చెందిన విద్యార్థి, ఉద్యమనేత నాగమధుయాదవ్‌ను జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా కాంగ్రెస్ పార్టీ నియమించడంపై ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి విద్యార్థినాయకుడిగా అనేక పోరాటాలు నిర్వహించి యువజన నాయకుడిగా జాతీయ స్థాయికి ఎదగటం అభినందనీయమన్నారు. ఏపీ ప్రత్యేక హోదా, యువజన హామీలు, నిరుద్యోగ పరిశ్రమల ఏర్పాటుకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు పోరాటాలు చేసేందుకు సిద్ధం అవుతున్నామన్నారు.

అధ్వానంగా పెద్దనేలటూరు, బురాన్‌దొడ్డి రోడ్డు



పెద్దనేటూరు, బురాన్‌దొడ్డి గ్రామాల మధ్య రోడ్డు దుస్థితి

గోనెగండ్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనేటూరు, బురాన్‌దొడ్డి గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా రోడ్డుకు మరమ్మతులు చేయించే నాథుడే కనిపించడం లేదు. ఈ రెండు గ్రామాల మధ్య నాలుగు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇదే రోడ్డు వెంట ఇరు గ్రామాల రైతులు పొలాలకు వెళ్లాల్సి వస్తుంది. వర్షాకాలంలో రైతులు ఈ దారి వెంట పొలాలకు విత్తనాలు, ఎరువులను తీసుకెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కాలి నడకన కూడా రాకపోకలు సాగించేలేకపోతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

పీ4లో భాగస్వాములు కావాలి

సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

నందవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4లో అధికారులు, నాయకులు భాగస్వాములు కావాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కోరారు. బుధవారం నందవరంలోని తహసీల్దారు కార్యాలయంలో పీ-4 పథకంపై నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ- 4 కార్యక్రమం వల్ల పేదలకు సాధికారికతను కల్పించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు నూతన ఆర్థిక, సామాజిక దిశగా కీలక అడుగులు వేస్తున్నారని తెలిపారు. వాటిలో మనందరం భాగస్వాములై ముందడుగు వేయాలని కోరారు. సమావేశంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈరన్నగౌడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయి, పుష్పావతి, మండల కన్వీనర్ కాశీంవలి, రైస్ మిల్ నారాయణరెడ్డి, గజేంద్రరెడ్డి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలి: అర్జీదారుల సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. బుధవారం తహసీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందవరంలో గతంలో ఇచ్చిన ప్రభుత్వ పట్టాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అలాగే పలు సమస్యల గురించి అధికారులతో చర్చించారు. గ్రామాల్లో సమస్యలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. తహసీల్దారు శ్రీనివాసులు, డీటీలు శశిశేఖర్‌రావు, మహేష్, ఆర్ఐ రవీంద్రారెడ్డి, ఎంఈవో రఘునాథ్ పాల్గొన్నారు.

ఈరన్నస్వామిని దర్శించుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు



స్వామి వారికి పూలు తీసుకువస్తున్న తిక్కారెడ్డి

కౌతాళం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి వారిని బుధవారం తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్యాలకుర్తి తిక్కారెడ్డి దర్శించుకున్నారు. వీరికి టీడీపీ నాయకులు ముందుగా బ్యాండ్ మేళాలతో దేవాలయం వరకు ఘనస్వాగతం పలికారు. ఆలయం వద్దకు రాగానే ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు స్వాగతం పలుకగా, అర్చకులు దేవాలయ ముఖ ద్వారం వద్ద ఉన్న విజయగణపతి మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ఆశీర్వాదించారు. అనంతరం ఈరన్న స్వామి అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం నవగ్రహాల మంటపం వద్ద ఆలయ అర్చకులు తిక్కారెడ్డితో పాటు టీడీపీ నాయకులకు పూలమాలలు, స్వామి వారి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ శ్రావణ మాసంలో స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. భక్తులు అసౌకర్యాలకు గురికాకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఈవోను కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, నాయకులు కోట్రేష్‌గౌడ్, కురుగోడు, రమేష్‌గౌడ్, దొడ్డనగౌడ్, సునీల్ రెడ్డి, సతీష్, కోసిగి భరద్వాజ్ శెట్టి, కుంబళనూరు సర్పంచ్ వీరేష్, మాజీ సర్పంచ్‌లు రంగస్వామి, చంద్ర శేఖర్ సిద్దు, ఓబుళాపురం నరసింహులు, సిద్దు, సోమశేఖర్ ఉన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

ఎమ్మిగనూరు జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు రాముడు, దేవసహాయం డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని పిలుపునిచ్చారన్నారు. అయితే నేడు టీడీపీ ప్రభుత్వం ఏర్పడి 13నెలలు అవుతున్నా స్మార్ట్ మీటర్లు తొలగించలేదన్నారు. స్మార్ట్ మీటర్ల విధానం మూడు కేటగిరీలుగా చేసి ప్రజలనుంచి కూటమి ప్రభుత్వం ప్రజలనుంచి వేల కోట్ల రుపాయాలు వసూలు చేయటానికి సిద్ధమవుతోందని ఆరోపించారు. సెల్‌ఫోన్ తరహాలో రీచార్జీ చేస్తేనే విద్యుత్ ప్రజలకు సరఫరా అవుతుందన్నారు. ఇలాంటి స్మార్ట్ మీటర్లను తక్షణమే రద్దుచేయాలని, ప్రభుత్వమే సర్దుబాటు చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు తిమ్మన్న, ఆంథోని, రాజారమేష్, తిమ్మప్ప, రాజులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వంట ఏజెన్సీల అక్రమాలను అరికట్టాలి: పీడీఎస్‌యూ



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఎమ్మిగనూరు జూలై 30(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో వంట ఏజెన్సీల అక్రమాలను అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్ర బాబు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం శ్రావణమాసం కావటంతో పాఠశాలల్లో హిందూ విద్యార్థులు చాలా మంది కోడిగుడ్డును తినటం లేదన్నారు. దీన్ని అదునుగా తీసుకున్న వంట ఏజెన్సీలు కోడిగుడ్లును విద్యార్థులకు పంపిణీ చేసినట్లుగా రికార్డుల్లో నమోదు చేసుకొని బయట విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. పాఠశాలల్లో కోడిగుడ్డు పంపిణీపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడుతున్న వంట ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు ఇమ్రాన్, చరణ్, రఘు, అరవింద్, ప్రసాద్ పాల్గొన్నారు.

చెక్క రథంపై ప్రహ్లాదరాయలు



చెక్క రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్కరథంపై విహరించారు. బుధవారం శావణ షష్టి శుభ దినం సందర్భంగా మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. చెక్క రథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించి వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. అంతకు ముందు స్వామివారికి పాదపూజ చేశారు. పీఠాధిపతి భక్తులను ఆశీర్వాదించారు.

గోనెగండ్లలో డెంగీ నమోదు

● ఏడాదిలో 12 కేసులు



గోనెగండ్లలో విచారణ చేస్తున్న అధికారులు

గోనెగండ్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో రెండవ సచివాలయ పరిధిలో బుధవారం బాలికకు డెంగీ సోకిందని ఏపీహెచ్‌వో హనుమంతు తెలిపారు. గ్రామంలో వైద్య సిబ్బంది పర్యటించారు. వీధిలోని ప్రజలకు అవగాహన కల్పించారు. నిలువ ఉన్న నీటిని పరిశీలించారు. వీధుల్లో మురుగు తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు కూడా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిలువ ఉన్న చోట ఆయిల్ బాయిల్, ఎంఎల్‌ఆయిల్ స్ప్రెయింగ్ చేయించారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం ఉన్నట్లు తెలిస్తే వెంటనే గోనెగండ్ల ప్రభుత్వ అసుపత్రికి రావాలిని వైద్యసిబ్బంది గ్రామస్థులకు సూచించారు. ఏడాది కాలంలో మండలంలో 12 డెంగీ కేసులు నమోదు అయ్యాయి. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో కృష్ణుడు, బలరామ్, పరిమళ ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్యఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి



కరపత్రాన్ని అందిస్తున్న తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు

గోనెగండ్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు మాల్లబాషా అన్నారు. బుధవారం మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఏడాది కాలంలో గోనెగండ్ల మండలంలోని పలు గ్రామాలలో రూ. 4.65కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమలో రమేష్, బాషా, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

గోనెగండ్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవ్వాలని సీపీఐ సీనియర్ నాయకుడు మద్దిలేటి నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం పెద్దమరివీడు గ్రామంలోని సచివాలయం దగ్గర నిరసన తెలిపారు. అనంతరం సచివాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, బ్యాంక్ రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొగ్గు మద్దిలేటి, కాడప్ప, శ్రీరాములు, మద్దిలేటి, యూనుష్, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

15లోగా కొత్త భవనంలోకి మారుస్తాం

● చెట్ల కింద చదువులకు శాశ్వత విముక్తి కల్పిస్తాం

● డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి

మంత్రాలయం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగూరు ఉన్నత పాఠశాలలో చెట్ల కింద చదువులకు శాశ్వత విముక్తి కలిగించేందుకు ఆగస్టు 15లోగా కొత్త భవనంలోకి మారుస్తామని డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో చెట్ల కిందే చదువులు అనే కథనం ప్రచురితమైంది. దాంతో ఆదోని డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి, ఎంఈవో రాగన్న పాఠశాలను పరిశీలించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలోనే ఉన్నత పాఠశాల కొనసాగించడం, ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు అర్థాంతరంగా ఆగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. దాంతో కొత్త భవనాన్ని పరిశీలించారు. భవనానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కలెక్టర్, డీఈవోతో మాట్లాడి ఆగస్టు 15లోగా ఉన్నత పాఠశాలను కొత్త భవనంలో మారుస్తామన్నారు. ప్రధానోపాధ్యాయుడు లచ్చప్ప ప్రత్యేక శ్రద్ధ తీసుకొని దాదాపు రూ.6లక్షల సొంత డబ్బులు ఖర్చు చేసి వంట గదులు, మరుగుదొడ్లను ఇతరత్రాపనులు చేయించారన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. వారి వెంట హెచ్‌ఎం వెంక టేశ్వర్లు, ఉపాధ్యాయులు రవికుమార్, గోపి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



అన్న క్యాంటీన్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

కోసిగి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాల్మీకి సర్కిల్ సమీపంలో అన్న క్యాంటీన్ కోసం స్థలాన్ని పరిశీలించినట్లు బుధవారం కర్నూలు పబ్లిక్ హెల్త్ మున్సిపల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ ఈఈ చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో కోసిగి, ఆలూరు, పత్తికొండ, పాణ్యం, బనగానపల్లెలో ఐదు అన్నక్యాంటీన్లు మంజూరైనట్లు తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి సూచనల మేరకు కోసిగి మండల కేంద్రంలో అన్న క్యాంటీన్ మంజూరైందని అందులో భాగంగానే వాల్మీకి సర్కిల్ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సమీపంలో స్థలాన్ని పరిశీలించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌సీసీ కాంట్రాక్టు కంపెనీ ఒక్కొక్క అన్న క్యాంటీన్‌కు రూ.60 లక్షలతో నిర్మిస్తుందని తెలిపారు. సోమవారం కోసిగి వాల్మీకి సర్కిల్ సమీపంలో అన్న క్యాంటీన్‌కు భూమి పూజ కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ విరుపాక్షి, టీడీపీ నాయకులు పల్లెపాడు రామిరెడ్డి, ఆర్లబండ సహకార సంఘం ఛైర్మన్ అయ్యన్న, మాజీ జడ్పీటీసీ రామకృష్ణ, వక్రాని వెంకటేశ్, చిన్న తాయన్న, కోసిగయ్య, మాణిక్యరాజు, రాజేష్, ఈరయ్య పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు డీఎస్పీగా భార్గవి



ఎమ్మిగనూరు జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు డీఎస్పీగా భార్గవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఎమ్మిగనూరు డీఎస్పీగా పనిచేస్తున్న ఉపేంద్ర బాబు కర్నూలు దిశా పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. పీటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్న ఎంఎన్ భార్గవిని ప్రభుత్వం ఎమ్మిగనూరు డీఎస్పీగా నియమించింది. దీంతో ఆమె బాధ్యతలు చేపట్టింది. సబ్ డివిజన్ పరిధిలో ఏమైనా సమస్యలు ఉన్నట్లైతే నేరుగా తనను కలువచ్చన్నారు. ప్రజల భాగస్వామ్యంతో శాంతిభద్రతలను పటిష్టం చేస్తామన్నారు. అలాగే నేరాల నియంత్రణ ప్రజలకు భద్రత కల్పించటం తన ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం కర్నూలులో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నానో యూరియాతో మంచి ఫలితాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శివశంకర్

ఎమ్మిగనూరు జూలై 30(ఆంధ్రజ్యోతి): నానో యూరియాతో మంచి ఫలితాలు ఉంటాయని ఏవో శివశంకర్ తెలిపారు. బుధవారం పార్లపల్లి, రాళ్లదొడ్డి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశమై నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాములు యూరియా వాడకం వల్ల 50శాతం వృథా అవుతుందన్నారు. నానో యూరియ స్ప్రే చేయటం వల్ల వందశాతం పంటకు ఉపయోగపడి అధిక లాభాలు వస్తాయన్నారు. రసం పీల్చే పురుగులకు, నీలం పసుపురంగు, తెలుపు రంగు జిగురు అట్టలు, గులాబీరంగు పురుగుల నివారణకు ఎకరాకు 20నుంచి 30 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల పంట దిగుబడి పెంచుకోవచ్చాన్నారు. సమావేశంలో ఏఈఓలు నరసింహులు, వినోద్, రసూల్, వీఏఏలు రమేష్, రాజేష్, రైతులు పాల్గొన్నారు.

చట్టంపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపాల్

ఎమ్మిగనూరు జూలై 30(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం గురించి విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా అన్నారు. బుధవారం ఎస్ఎంఎల్ డిగ్రీ కళాశాలలో ఆర్‌టీఐ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆర్‌టీఐ చట్టంతో చాలా ఉపయోగాలు ఉన్నాయన్నారు. సమాచార హక్కు చట్టం పౌరులకు ఉండే అతిముఖ్యమైన హక్కు అని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీల, న్యాక్ కోఆర్డినేటర్ పాల్ దేవదానం, ఆర్‌టీఐ ఇన్‌చార్జీ రాజశేఖర్ రెడ్డి, తిప్పస్వామి, వెంకటరాముడు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని వినియోగించుకోవాలి

మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణవాసులు లేఅవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్‌ఆర్‌ఎస్) పథకాన్ని వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మట్లాడుతూ అనధికారిక లే-అవుట్లు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు రాష్ట్ర పురపాలక శాఖ జీవో విడుదల చేసిందన్నారు. 2025జూన్ 30కి ముందు అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఉంటే ఈనెల 26తేది నుంచి 90రోజుల్లోపు ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుత రిజిస్ట్రేన్ ప్రకారం 14శాతం చార్జీలు చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై సచివాలయ కార్యదర్శులు, ఇంజనీర్లు, మున్సిపల్ లైసన్సు ఇంజనీర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో టీపీఓ రాజేష్ పాల్గొన్నారు.